


# మహా పత్రిక

Follow: @ANNTELUGU

20-10-2026

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 256 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



ఆదిలాబాద్‌లో

## దసరా సందడి

**దుర్గా మాతలను దర్శించుకున్న కంది శ్రీనివాస రెడ్డి దంపతులు**

**ఆదిలాబాద్ , మహా :** ఆదిలాబాద్ లో దసరా సందడి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి ,కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సోమవారం బేల మండలంలో పర్యటించారు . మండలంలో నెలకొల్పిన పలు దుర్గా మాత మండపాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బేల మండలం భవానిగూడ దుర్గామాత మండపం వద్ద కంది శ్రీనివాస రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బేల మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహా పత్రిక పాఠకులకు, ప్రకటనకర్తలకు **దసరా శుభాకాంక్షలు**. దసరా పండుగను పురస్కరించుకుని మహా పత్రికకు సెలవు ప్రకటించడమైనది. పత్రిక పునర్దర్శనం గురువారం.

- మహా పత్రిక యాజమాన్యం

### టాప్ న్యూస్

**అధర్మంపై ధర్మం సాధించిన విజయ ప్రతీక దసరా**



సీఎం రేవంత్ రెడ్డి

02

**ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్ సబ్‌కమిటీ**



- ఛైర్మన్‌గా భట్టి విక్రమార్క
- కమిటీలో మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, సీతక్క, తుమ్మల

02

**విజయవాడ ఉత్సవ్‌కు ఘనంగా ముగింపు**

VIJAYAWADA UTSAV Sep 22nd to Oct 2nd One City, One Celebration

- 2 వేల మంది కళాకారులతో దసరా కార్నివాల్.
- కార్నివాల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు.
- అమ్మవారి అలంకారాలు, ప్రత్యేక రథంతో భారీ ప్రదర్శన



03

# డీ లిమిటేషన్ పై సంప్రదింపులు పూర్తి






కేంద్రం షాకింగ్ ఎనౌన్స్ మెంట్

ప్రతిపక్షాలు సహకరించాలని

ఖర్గేకు కేంద్రమంత్రి రిజిజు లేఖ



**ఢిల్లీ, మహా :** పార్లమెంట్‌లో డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టే ముందు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే గత అక్టోబర్ 16న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి రాసిన లేఖపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. ప్రభుత్వం పదే పదే కోరినప్పటికీ కాంగ్రెస్ పార్టీ చర్చలకు సమయం కేటాయించకపోవడంతో ఇతర రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరిపామని **మిగతా 2వ పేజీలో**

**ఫ్యూచర్ సిటీలో సీఎం రేవంత్ రెడ్డి**

పోలీస్ కమిషనరేట్ ప్రారంభం.. గ్లోబల్ సమ్మిట్ పై సమీక్ష

02











# విజయవాడ ఉత్సవ్‌కు ఘనంగా ముగింపు

**విజయవాడ, మహా:** దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా విజయవాడలో మంగళవారం భారీ కార్నివాల్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దసరా ఉత్సవాలతో పాటు కృష్ణానది తీరాన నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ మంగళవారంతో ముగియనున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా సుమారు 2 వేల మంది కళాకారులతో ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.సోమవారం విజయవాడలో మాట్లాడిన పట్టాభిరామ్.. గత ఏడాది కంటే భిన్నంగా, మరింత ఆకర్షణీయంగా ఈసారి కార్నివాల్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దసరా సందర్భంగా వివిధ వేషధారణలు, సంప్రదాయ కళారూపాలతో ప్రదర్శనలు ఇచ్చే కళాకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా కళాకారులు పాల్గొంటారని వివరించారు.ఏలూరు రోడ్డులోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల వద్ద మంగళవారం కార్నివాల్ ప్రారంభమవుతుందని పట్టాభిరామ్ తెలిపారు. అమ్మవారి అలంకారాలు, ప్రత్యేకంగా రూపొందించిన రథం, 40 కళాబృందాలతో ప్రదర్శన కొనసాగుతుందని చెప్పారు. ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల నుంచి విశాలాంధ్ర మీదుగా ఇందిరాగాంధీ స్టేడియం వరకు కార్నివాల్ సాగుతుందని వెల్లడించారు.బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఇతర అతిథులు పాల్గొంటారని తెలిపారు.కార్యక్రమంలో పాల్గొనే కళాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పట్టాభిరామ్ చెప్పారు. అమ్మవారి భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రదర్శనలను తిలకించాలని కోరారు. పొరుగు జిల్లాల ప్రజలు కూడా విజయవాడకు వచ్చి కార్నివాల్‌ను వీక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు, కృష్ణానది తీరంలోని విజయవాడ ఉత్సవ్ నగరంలో పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చాయని నిర్వాహకులు తెలిపారు. మంగళవారం నిర్వహించే కార్నివాల్‌తో ఉత్సవాలకు ముగింపు పలకనున్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో జనసేన బోణీ

# దర్శి చైర్మన్ పీఠం కైవసం

దర్శి, మహా : తొలి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి కేవలం ఒక్కసీటుకే పరిమితమైన జనసేన.. రెండో ప్రయత్నంలో పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లోనూ విజయదుందుభి మోగించింది. ఆపై స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటాలని ఈ కూటమి పార్టీ ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఏపీ మున్సిపల్ ఎన్నికల నగారా మోగిన వేళ... పోలింగ్ జరగకుండానే కూటమి ఖాతాలో 6 చైర్ పర్సన్ స్థానాలు ఏకగ్రీవం అవుతున్నాయి. ఈ క్రమంలో తొలి విక్టరీ జనసేన దక్కించుకుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లా దర్శిలో కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి దారం సుబ్బారావు మున్సిపల్ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం (అక్టోబర్ 18న) నామినేషన్ల గడువు మధ్యాహ్నం 3 గంటలకు ముగిసే సమయానికి.. వైసీపీ తరపున ఎలాంటి నామినేషన్ రాకపోవడంతో దర్శి మున్సిపల్ చైర్మన్‌గా టీడీపీ, జనసేన, బీజేపీ మద్దతు తెలిపి బరిలో నిలిపిన దారం సుబ్బారావు ఎన్నిక లాంఛనమైంది. జనసేన పార్టీ చరిత్రలోనే మొట్టమొదటి మున్సిపల్ ఛైర్మన్ పీఠం దర్శి కావడంతో జనసైన అధినేత పవన్ కళ్యాణ్, పార్టీ నేతలు, జనసైనికులు సంతోషంగా ఉంటారు. కూటమి శ్రేణులు దర్శి వీధుల్లో బాణసంచా కాలుస్తూ భారీ ఎత్తున సంబరాలు చేసుకుంటున్నాయి. టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మి రాజకీయ దూకుడుతో వైసీపీ డిఫెన్స్‌లో పడిపోయింది. ఈ క్రమంలో మొత్తం 25 మంది వైసీపీ కౌన్సిలర్ అభ్యర్థులు మూడోరోజైన శనివారం సైతం నిర్ణీత సమయానికి నామినేషన్లు దాఖలు చేయలేక వెనుదిరగాల్సి వచ్చింది. అయితే దర్శి మున్సిపాలిటీ చైర్ పర్సన్ ఏకగ్రీవ పరిణామం రాజకీయ దుమారానికి తెరతీసింది. తాను నామినేషన్ వేయడానికి వెళ్తుండగా కూటమి పార్టీల కార్యకర్తలు, రౌడీ మూకలు తనను అడ్డుకున్నారని దర్శి వైసీపీ ఛైర్మన్ అభ్యర్థి వెన్నపూస వెంకటరెడ్డి మీడియా ముందు కన్నీళ్లు పెట్టుకోవడం హాట్ టాపిక్ అయింది. నామినేషన్ వేయకుండా తనపై దాడి చేసి తీవ్రంగా అవమానించారని, రాజ్యాంగం కల్పించిన పోటీ చేసే హక్కును కాలరాశారని అన్నారు. జిల్లా కలెక్టర్, ఎన్నికల సంఘం తక్షణమే జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని, చివరి రోజున కూడా తన నామినేషన్ దాఖలు చేసుకునేలా అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకుని.. నామినేషన్ వేసేందుకు ఏపీ ఎన్నికల కమిషనర్ తనకు అవకాశం ఇవ్వాలన్నారు. వైసీపీ చైర్మన్ అభ్యర్థి దారం సుబ్బారావు నామినేషన్ వేయకపోవడంతో జనసేన అభ్యర్థి దారం సుబ్బారావు దర్శి మున్సిపల్ పీఠంపై కూర్చోవడం దాదాపు ఖాయమైంది. ఏపీలో 6 మున్సిపాలిటీలు, 2 నగర పంచాయతీలలో వైసీపీ తరపున ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని కూటమి అభ్యర్థులు ఏకగ్రీవం ఖాయమని వినిపిస్తోంది.

# మోగిన మరో ఎన్నికల నగారా

**ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల**

అమరావతి, మహా : ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది. రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. ఏపీ ఎన్నికల కమిషర్ అనిల్ చంద్ర పునేఠా ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదల చేసిన తరువాత మాట్లాడుతూ.. ఈ నెల 21వ తేదీ నుండి 23వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరిస్తామని తెలిపారు. ఎంపీటీసీ స్థానాలకు సంబంధిత మండల కేంద్రాల్లో, జడ్పీటీసీ స్థానాలకు జిల్లా పరిషత్ (జడ్పీ) కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను చేపడతారని వెల్లడించారు. జడ్పీ చైర్మన్ పదవులకు నేరుగా ఎన్నిక జరుగుతుందని ఈసీ స్పష్టం చేసింది.
అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను అక్టోబర్ 24న పరిశీలిస్తారు. అనంతరం పోటీ నుంచి వైదొలగాలనుకునే అభ్యర్థులకు అక్టోబర్ 27 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఇచ్చారు. నవంబర్ 3న ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు పోలింగ్ జరగనుండగా, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు చేపట్టి అదే రోజు విజేతల్ని ప్రకటించనున్నారు. ఎన్నికల నిర్వహణను పకడ్బందీగా చేపట్టడంతో పాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళి సరిగ్గా అమలయ్యేలా పర్యవేక్షించడానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక నోడల్ అధికారులను ఈసీ నియమించింది.

**ముఖ్యమైన తేదీలివే**

ఏపీలో తొలిసారి 28 జెడ్పీ చైర్మన్ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. అన్ని జిల్లాల ప్రజా పరిషత్‌ల పరిధిలో ఉన్న659 జడ్పీటీసీ, 659 ఎంపీపీ స్థానాలకు, 9,829 ఎంపీటీసీ స్థానాలకు ఈ ఎన్నికలను నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. 2 కోట్ల 81 లక్షల మందికి ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ నోటిఫికేషన్ విడుదలతో ఏపీలో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ అధికారికంగా ప్రారంభమవుతుంది.

**ఎన్నికల షెడ్యూల్ ముఖ్య తేదీలు**

- ఎన్నికల నోటిఫికేషన్: అక్టోబర్ 19
- ఆర్ఓ/ఈవో ఎన్నికల నోటీసు జారీ, నామినేషన్ల ప్రారంభం: అక్టోబర్ 21
- నామినేషన్ల స్వీకరణ ఆఖరి తేదీ: అక్టోబర్ 23, 2026
- నామినేషన్ల పరిశీలన తేదీ: అక్టోబర్ 24, 2026
- తిరస్కరించిన నామినేషన్లపై అప్పీల్: అక్టోబర్ 25, 2026
- అప్పీళ్ల పరిష్కారించే తేదీ: అక్టోబర్ 26
- నామినేషన్ల ఉపసంహరణకు ఆఖరి తేదీ: అక్టోబర్ 27
- పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా: అక్టోబర్ 27, 2026
- పోలింగ్ తేదీ: నవంబర్ 03, 2026
- రీపోలింగ్ (అవసరమైతే): నవంబర్ 04, 2026
- ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన: నవంబర్ 05, 2026

మైదుకూరులో మున్సిపల్ ఎన్నికలు వాయిదా
కడప జిల్లా మైదుకూరులో మున్సిపల్ ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు అనిల్‌చంద్ర పునేఠా ప్రకటించారు. నామినేషన్ పత్రాలను చించివేసినందున వాటిని పరిశీలించలేమని, ఈ క్రమంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కడప జిల్లా కలెక్టర్ నివేదిక మేరకు మైదుకూరులో మున్సిపల్ ఎన్నికలను వాయిదా వేసినట్లు ప్రకటించారు. త్వరలోనే మైదుకూరు ఎన్నికల ప్రకియకు మళ్లీ నోటిఫికేషన్ ఇస్తామన్నారు.

# డీ లిమిటేషన్ పై సంప్రదింపులు పూర్తి

( మొదటి పేజీ తరువాయి )
రిజిజు స్పష్టం చేశారు. బిల్లుపై విస్తృత ఏకాభిప్రాయం కోసం డీఎంకే, ాసమాజ్‌వాదీ పార్టీ, వైఎస్సార్ సీపీ, ఎన్‌సీపీ, శివసేన, ఏఐఎంఐఎం, బీజేడీ వంటి వివిధ పార్టీల ప్రతినిధులతో ప్రభుత్వం ఇప్పటికే చర్చలు పూర్తి చేసిందని తెలిపారు. ఈ మేరకు కిరణ్ రిజిజు సోమమారం ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేకు లేఖ రాశారు. ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు చర్చలకు ప్రయత్నించిన నేపథ్యంలో మళ్లీ సంప్రదింపులు జరపాలని కాంగ్రెస్ పార్టీ పదేపదే డిమాండ్ చేయడంలో అర్థం ఏమిటని కిరణ్ రిజిజు ప్రశ్నించారు. ఇప్పటికే చేపట్టిన సంప్రదింపులను పరిగణనలోకి తీసుకోవాలని అదే డిమాండ్‌ను పునరావృతం చేయడం కంటే ప్రతిపక్ష పార్టీలు నిర్మాణాత్మక సహకారం అందించాలని సూచించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పార్లమెంట్ సమర్థంగా పనిచేసేలా అర్థవంతమైన చర్చలకు అవకాశం కల్పించేందుకు సిద్ధంగా ఉందని లేఖలో



పేర్కొన్నారు. జాతీయ ప్రాధాన్యం కలిగిన అంశాలపై చర్చల్లో అన్ని రాజకీయ పార్టీల భాగస్వామ్యాన్ని ప్రభుత్వం విలువైనదిగా భావిస్తుందని తెలిపారు.

**ప్రతిపక్షాలు సహకరించాలి**

భవిష్యత్తులో ప్రవేశపెట్టే కీలక బిల్లుల విషయంలో కాంగ్రెస్ పార్టీ నిర్మాణాత్మక పాత్ర పోషించాలని కిరణ్ రిజిజు ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమైన బిల్లుల ఆమోద ప్రక్రియకు కాంగ్రెస్ అడ్డంకులు సృష్టించకూడదని కోరారు. పార్లమెంటులో చర్చలు, సంప్రదింపుల ద్వారా విస్తృత ఏకాభిప్రాయం సాధించేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. కాగా వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి లోక్ సభ సీట్లను 50 శాతం మేర పెంచడంతో పాటు 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమల్లోకి తీసుకురావాలనే పట్టుదలతో ఉన్న కేంద్ర ప్రభుత్వం అందుకు సంబంధించిన బిల్లులను ఆమోదించుకోవడానికి ఈ నెలాఖరులో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు సిద్ధమవుతున్నట్లు మీడియాలో ప్రచారం జరుగుతున్న వేళ కిరణ్ రిజిజు లేఖ హాట్ టాపిక్‌గా మారింది.

# ఫ్యూచర్ సిటీలో సీఎం రేవంత్ రెడ్డి

**పోలీస్ కమిషనరేట్ ప్రారంభం.. గ్లోబల్ సమ్మిట్ పై సమీక్ష**

హైదరాబాద్, మహా : సీఎం రేవంత్ రెడ్డి సోమవారం ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేసేందుకు ఈ కమిషనరేట్‌ను నిర్మించారు. దీంతో పాటు సీఎం యాచారం మండలం కుర్మిద్ద గ్రామంలో ఏర్పాటు చేయనున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేశారు. అలాగే భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ క్యాంపస్‌ను సందర్శించి, అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను, శిక్షణ సౌకర్యాలను పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా డిసెంబర్ 7-9 తేదీలలో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' ఏర్పాట్లపై సీఎం సమీక్ష నిర్వహించారు. సమ్మిట్ నిర్వహించనున్న స్థలాన్ని పరిశీలించి అధికారులతో చర్చలు జరిపారు. అనంతరం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలో ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించి, మాస్టర్ ప్లాన్‌లు, కీలక మౌలిక వసతుల ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు.













# అధర్మంపై ధర్మం సాధించిన విజయ ప్రతీక దసరా

**: సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, మహా :** చెడుపై మంచి సాధించిన గెలుపు, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక జరుపుకునే విజయదశమి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో దసరాకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. దసరా పండుగ మనకు ధైర్యం, ధర్మం, సత్యం, ఐకమత్యం, ఆత్మవిశ్వాసం వంటి గొప్ప విలువలను బోధిస్తుందని పేర్కొన్నారు.



# కోలుకున్న ఎల్‌కే అద్వానీ

- ఆసుపత్రి నుంచి ఇంటికి
- న్యూరాలజిస్ట్ డాక్టర్ వినీత్ సూరి పర్యవేక్షణలో చికిత్స
- ఇటీవల వయోభారంతో పలుమార్లు ఆసుపత్రిలో చేరిన అద్వానీ

**న్యూఢిల్లీ, మహా :** బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఛాతీ ఇన్ఫెక్షన్‌తో ఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆసుపత్రిలో చేరిన 98 ఏళ్ల అద్వానీ, ఆరోగ్యం మెరుగుపడటంతో సోమవారం ఇంటికి తిరిగి వెళ్లారు. ఈ మేరకు ఆసుపత్రి వర్గాలు ఒక ప్రకటన విడుదల చేశాయి. ఈ నెల 16వ తేదీ సాయంత్రం అస్వస్థతకు గురవడంతో ఆయనను కుటుంబసభ్యులు ఆసుపత్రిలోని పల్మనరీ విభాగంలో చేర్పించారు. సీనియర్ న్యూరాలజీ కన్సల్టెంట్ డాక్టర్ వినీత్ సూరి పర్యవేక్షణలో ఆయనకు చికిత్స అందించారు. చికిత్సకు ఆయన శరీరం స్పందించిందని, ఆరోగ్య పరిస్థితి మెరుగుపడినందున డిశ్చార్జ్ చేస్తున్నట్లు అపోలో ఆసుపత్రి పేర్కొంది. అద్వానీ ఆసుపత్రిలో ఉన్నప్పుడు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా శనివారం ఆయనను పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. వయోభారం కారణంగా ఇటీవలి కాలంలో అద్వానీ పలుమార్లు ఆసుపత్రిలో చేరారు. ఈ ఏడాది మే నెలలో కూడా వయసు సంబంధిత ఆరోగ్య సమస్యలతో కొన్ని రోజులు ఆసుపత్రిలో చికిత్స పొందారు. అంతకుముందు 2024 డిసెంబర్‌లో కూడా ఆయనను ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లో చేర్చి వైద్య పరీక్షలు నిర్వహించారు.

# ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్ సబ్‌కమిటీ

- చైర్మన్‌గా భట్టి విక్రమార్క
- కమిటీలో మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, సీతక్క, తుమ్మల

**హైదరాబాద్, మహా** : ఎల్‌నినో పరిస్థితిని సమీక్షిస్తూ తగిన నిర్ణయాలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేసింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చైర్మన్‌గా ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వర రావు, వాకిటి శ్రీహరి సభ్యులుగా కేబినెట్ సబ్‌కమిటీ నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం సలహాదారు, మాజీ సీఎస్ రామకృష్ణారావు ప్రత్యేక ఆహ్వానితుడిగా కేబినెట్ సబ్‌కమిటీని సమన్వయం చేస్తూ అవసరమైన వివరాలు అందిస్తారని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ కన్వీనర్‌గా ఉంటారని వివరించింది.

**ఇవీ కేబినెట్ సబ్‌కమిటీ విధులు**

ఇటీవల మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు మంత్రివర్గ ఉపసంఘం ఎల్‌నినో పరిస్థితులు సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు ఆదేశాలు, సూచనలు ఇస్తుందని ఉత్తర్వుల్లో సర్కార్ పేర్కొంది. రానున్న రోజుల్లో సాగు, తాగునీరు, విద్యుత్, పశుగ్రాసం కొరత, రిజర్వాయర్లు, నిధుల నిర్వహణ కీలకం కానున్న తరుణంలో ఆయా శాఖల మంత్రులతో కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు ప్రజలు చేయాల్సిన



పనులు, కేంద్ర సహకారం వంటి అంశాలపై క్యాబినెట్ సబ్ కమిటీ చర్చిస్తుందని వివరించింది. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో తలెత్తిన పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనలో నిమగ్నమైంది. వర్షాభావం కారణంగా సుమారు 11.18 లక్షల ఎకరాల్లోని పంటలు చేతికందే అవకాశం లేదనే అంచనాల నేపథ్యంలో వివిధ శాఖల పరిధిలోని పరిస్థితుల నివేదికలను సేకరించి, ప్రత్యామ్నాయ చర్యలను అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇటీవల జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశంలోనూ వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో సాధారణం కన్నా 17 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లుగా అధికారులు అంచనా వేశారు. సుమారు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నట్లు కూడా సర్కారు అంచనా వేస్తోంది. కరవు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయాన్ని అందించాలని ఇప్పటికే శాసనసభలో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రూ.20 వేల కోట్ల స్పెషల్ ప్యాకేజీని కేటాయించాలని కూడా కోరింది. ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ఇప్పటికే అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. తాజాగా కేబినెట్ నిర్ణయం మేరకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు చేసేందుకు డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలో సబ్ కమిటీని ఏర్పాటు చేసింది.

# హైదరాబాద్ చైతన్యపురిలో విషాదం

**షేర్ మార్కెట్లో నష్టాలతో ఆత్మహత్య**

**హైదరాబాద్, మహా :** షేర్ మార్కెట్ లో భారీగా నష్టపోవడంతో మనస్తాపానికి గురైన హైదరాబాదుకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. మూడు నెలల క్రితమే వివాహమైన ఆ యువకుడు జీవితంపై విరక్తితో భవనంపై నుంచి దూకి ప్రాణాలు విడిచాడు. ఈ హృదయ విదారక ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే... తమ్మిశెట్టి ప్రవీణ్ (34) అనే వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అతనికి మూడు నెలల క్రితమే వివాహమైంది. కొంతకాలంగా ప్రవీణ్ షేర్ మార్కెట్ లో పెట్టుబడులు పెడుతున్నాడు. అయితే, ఇటీవల మార్కెట్ లో నష్టాల కారణంగా అతను పెట్టిన డబ్బులు మొత్తం పోగొట్టుకున్నాడు. దీంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురయ్యాడు.భారీ నష్టాల విషయం కుటుంబ సభ్యులకు, బంధువులకు తెలిస్తే పరువు పోతుందని తీవ్రంగా మదనపడ్డాడు. ఈ క్రమంలోనే ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని, చైతన్యపురిలోని ఓ భవనంపై నుంచి కిందికి దూకేశాడు. తీవ్ర గాయాలపాలైన ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న చైతన్యపురి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం, ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో ప్రవీణ్ కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.




# ఏఐతో చైనాకు భారత సైనిక రహస్యాలు

**హైదరాబాద్ లో సైన్యాధికారి భార్యను అరెస్టు చేసిన జమ్ముకశ్మీర్ పోలీసులు**

హైదరాబాద్, మహా : ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో చైనాకు భారత సైనిక సమాచారాన్ని చేరవేస్తున్నారనే ఆరోపణలపై సికింద్రాబాద్‌కు చెందిన ఓ మహిళపై జమ్మూ కశ్మీర్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేశారు. నేషనల్ సెక్యూరిటీకి సంబంధించిన రహస్య సమాచారంపై కీలక డాక్యుమెంట్లను ఆమె గూఢచర్యం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సికింద్రాబాద్‌కు చెందిన ఈ మహిళ జమ్మూ కశ్మీర్‌లో సైనికాధికారి భార్య కావడం గమనార్హం. ఆమె 2021లో బెంగళూరులో ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ, 2022లో జెనీవాలో మాస్టర్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ పూర్తి చేశారు. అలాగే 2023లో ఐక్యరాజ్యసమితిలో ఐటీ రంగంలో ఇంటర్న్‌షిప్ చేసి, ప్రస్తుతం ఫ్రీలాన్స్ పరిశోధకురాలిగా పనిచేస్తున్నారు. దేశ రక్షణ, భద్రత, భౌగోళిక రాజకీయ అంశాలు, ఎల్ఓసీ వెంట పరిస్థితులు, మౌలిక వసతుల ప్రాజెక్టులు, డ్రోన్ల మోహరింపుపై ఆమె విశ్లేషణలు రాసినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 14న పఠాన్‌కోట్ వెళ్లేందుకు జమ్మూతావి రైల్వే స్టేషన్‌కు రాగా, కేంద్ర నిఘా వర్గాల సమాచారంతో ఆమెను అదుపులోకి తీసుకుని సైనిక స్థావరానికి తరలించారు. మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు.

**ఓపెన్ ఏఐ ద్వారా**

ఐక్యరాజ్యసమితి ఇంటర్న్‌షిప్ సమయంలో విదేశీయులతో, చైనీయులతో వాట్సాప్‌లో చాట్ చేసినట్లు, 2024లో మలేసియా జాతీయుల ద్వారా చైనా నిఘా వర్గాలతో సంప్రదింపులు జరిపినట్లు తేలింది. ఓపెన్ ఏఐ, చాట్ జీపీటీల ద్వారా సమాచారం సేకరించానని ఆమె చెబుతున్నప్పటికీ, ఆమె ఫోన్‌లో భారత్‌ఇటలీ రక్షణ బంధం, ఆర్మీ చీఫ్ అమెరికా పర్యటన, భారత్‌రష్యా ఒప్పందాలు, అరుణాచల్ ప్రదేశ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులకు సంబంధించిన రహస్య అంశాలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గాంధీ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఆమెపై అధికార రహస్యాల చట్టం, గూఢచర్యం, నేరపూరిత కుట్ర, జాతీయ సార్వభౌమత్వానికి వ్యతిరేక చర్యల కింద కేసులు నమోదు చేశారు. ఈ విచారణకు ప్రత్యేకంగా డీఎస్పీని నియమించారు. ప్రస్తుతం ఆమె డిజిటల్ పరికరాలు, ఆర్థిక లావాదేవీలపై సమగ్ర దర్యాప్తు జరుగుతోంది.

# డేంజర్ బెల్స్

## పాతాళానికి పడిపోతున్న భూగర్భ జలాలు

**నీటి కష్టాలు తప్పవంటున్న నిపుణులు**
**క్రిటికల్ కేటగిరిలో ఏడు ప్రాంతాలు**

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ మహానగరంతో పాటు దానికి ఆనుకుని ఉన్న జిల్లాల్లో నీటి సంక్షోభం తీవ్రరూపం దాల్చుతోంది. వార్షిక భూగర్భ జల వనరుల్లో దాదాపు 70 శాతానికి పైగా ఇప్పటికే తోడేయడంతో ఈ ప్రాంతాలు తీవ్రమైన గ్రౌండ్ వాటర్ స్ట్రెస్ (భూగర్భ జల ఒత్తిడి)ని ఎదుర్కొంటున్నాయి. 202526 సంవత్సరానికి సంబంధించిన ఇండియాగ్రౌండ్ వాటర్ రిసోర్స్ ఎస్టిమేషన్ సిస్టమ్ అంచనాల ప్రకారం.. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలతో కూడిన కోర్ అర్బన్ రీజియన్‌లో లభ్యమయ్యే 72,000 హెక్టార్‌మీటర్ల వార్షిక భూగర్భ జలాల్లో.. ఇప్పటికే దాదాపు 48,000 హెక్టార్‌మీటర్ల నీటిని తోడేసినట్లు తేలింది.

ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే భూగర్భ జలాల తోడకం పునరుద్ధరణ అయ్యే లభ్యత కంటే దాటిపోయింది. జిల్లాలోని మొత్తం 16 గ్రౌండ్ వాటర్ అసెస్మెంట్ యూనిట్లలో 15 యూనిట్లు క్రిటికల్ లేదా ఓవర్‌ఎక్స్‌ప్లోయిటెడ్ (అతిగా తోడేసిన) కేటగిరీ కిందకు చేరాయి. హైదరాబాద్ జిల్లా పరిధిలోని 8 ప్రాంతాలు ఓవర్ ఎక్స్ ప్లోయిటెడ్ కేటగిరీలో ఉన్నాయి. అందులోనివి అంబర్‌పేట్, అమీర్‌పేట్, ఆసిఫ్‌నగర్, చార్మినార్, గోల్కొండ, హిమాయత్‌నగర్, ఖైరతాబాద్, సైదాబాద్. మరో 7 ప్రాంతాలు క్రిటికల్ కేటగిరీలో ఉన్నాయి. అవి బహదూర్‌పురా, బండ్లగూడ, మారేడ్‌పల్లి, ముషీరాబాద్, నాంపల్లి, సికింద్రాబాద్, షేక్‌పేట్. లభ్యమయ్యే నీటిలో 90 నుండి 100 శాతం వరకు వాడితే ఆ ప్రాంతాన్ని 'క్రిటికల్'గా, వాడకం 100 శాతం దాటిపోతే దానిని ఓవర్‌ఎక్స్ ప్లోయిటెడ్ నిర్ధారిస్తారు. కాగా గత ఏడాది (202425) హైదరాబాద్‌లో 11 యూనిట్లు క్రిటికల్ లేదా ఓవర్‌ఎక్స్ప్లోయిటెడ్ పరిధిలో ఉండగా, ఈ ఏడాది ఆ సంఖ్య 15కు పెరగడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. నివాస, వాణిజ్య, పారిశ్రామిక కార్యకలాపాలు విపరీతంగా పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని తెలంగాణ భూగర్భ జలాల శాఖ స్పష్టం చేసింది.



హైదరాబాద్ వాటర్ బోర్డు అందిస్తున్న నీరు నగర మొత్తం అవసరాలలో కేవలం 30 శాతం మాత్రమే తీర్చగలుగుతోంది. దీంతో మిగిలిన 70 శాతం అవసరాల కోసం గృహాలు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలు పూర్తిగా బోర్ బావులపైనే ఆధారపడుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర జనాభాలో దాదాపు మూడో వంతు హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలోనే నివసిస్తున్నప్పటికీ, రాష్ట్ర వార్షిక భూగర్భ జల వనరులలో ఈ ప్రాంతానికి దక్కుతున్నది కేవలం 3 శాతం మాత్రమే. తెలంగాణలో లభ్యమయ్యే భూగర్భ జలాలు దాదాపు 21 లక్షల హెక్టార్‌మీటర్లు కాగా.. క్యూర్ పరిధిలో ఉన్నది కేవలం 72,000 హెక్టార్‌మీటర్లు మాత్రమే. హైదరాబాద్ ఎదుర్కొంటున్న సమస్య కేవలం నీటిని విపరీతంగా తోడేయడమే కాదు, భూమిలోకి ఇంకే నీటి శాతం పడిపోవడం కూడా ప్రధాన కారణం. నగరంలో వేగంగా జరుగుతున్న పట్టణీకరణ, విశాలమైన ఖాళీ స్థలాలు మాయమై కాంక్రీట్ రోడ్లు, భవనాలుగా మారడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ



జలాలు పునరుద్ధరణ అయ్యే అవకాశం లేకుండా పోయింది.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

నగరంలోని ప్రతి నివాసం, కమర్షియల్ కాంప్లెక్స్‌లలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం తప్పనిసరి చేయాలి. నగర పరిధిలోని సహజ నీటి వనరులు, చెరువులను కబ్జాల బారిన పడకుండా కాపాడుకుని, వాటిని పూడిక తీత ద్వారా రీఛార్జ్ పాయింట్లుగా మార్చాలి. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని కన్‌స్ట్రక్షన్, తోటపని వంటి అవసరాలకు వాడాలి. ప్రతి పౌరుడు నీటి వృథాను అరికట్టి, భూగర్భ జలాల సంరక్షణలో భాగస్వామి కావాలి. న్నూర్ పోర్టులో అత్యధికంగా 222.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చెన్నై కేంద్రంలో 162 మిల్లీమీటర్లు, మీనంబాక్కం ఇస్రో కేంద్రంలో 126.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చెంగల్పట్టు జిల్లాలోని వీఐటీ చెన్నైలో 78.5 మిల్లీమీటర్లు, తిరువళ్లూరు జిల్లాలోVని జయ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో 59 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కల్లకురిచ్చిలో 44 మిల్లీమీటర్లు, రాణిపేటలో 42 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ గణనీయమైన వర్షపాతం నమోదైంది. తిరువారూరులో 37.5 మిల్లీమీటర్లు, కొడైకెనాల్ ఆటోమేటిక్ వాతావరణ కేంద్రంలో 32.9 మిల్లీమీటర్లు, మహాబలిపురంలో 31.5 మిల్లీమీటర్లు, తిరుపత్తూర్ కలెక్టరేట్ కేంద్రంలో 28 మిల్లీమీటర్లు, సేలం జిల్లాలోని మెట్టూరులో 22 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చెన్నైలోని టీఎన్‌వీఏఎస్‌యూ మాధవరం కేంద్రంలో 61 మిల్లీమీటర్లు, సేలంలోని సంధియూరులో 32.5 మిల్లీమీటర్లు, దిండిగల్‌లోని ఎంఎస్‌ఆర్‌ఎఫ్ కన్నివాడి కేంద్రంలో 17 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

# ప్రజాధనంతో నిర్మించిన రోడ్డును ధ్వంసం చేస్తారా?

- **నిందితులపై కఠిన చర్యలు తీసుకోండి.**
- **నష్టాన్ని బాధ్యుల నుంచే వసూలు చేయాలి.**
- **డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు.**



**అమరావతి, మహా**: ప్రజాధనంతో నిర్మించిన రోడ్డును ట్రాక్టర్‌తో ధ్వంసం చేసిన ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం క్షమించరాని నేరమని పేర్కొంటూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**రూ. 4.75 కోట్లతో నిర్మించిన రహదారి ధ్వంసం**

తిరుపతి జిల్లా పుల్లంపేట మండలంలోని అనంత సముద్రం, పాపక్కగారిపల్లె గ్రామాల మధ్య పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా సుమారు రూ. 4.75 కోట్ల వ్యయంతో రహదారిని నిర్మించారు. వారం రోజుల క్రితమే నిర్మించిన ఈ రహదారిలో దాదాపు 100 మీటర్ల మేర ట్రాక్టర్‌తో దున్ని ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో వైసీపీ నేత సుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి అనే మరో వ్యక్తి ప్రమేయం ఉన్నట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ కొనసాగుతోంది.

నిందితులపై కఠిన చర్యలకు ఆదేశం

ఈ ఘటనపై సోమవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఇప్పటికే ప్రథమ సమాచార నివేదిక నమోదు చేసినట్లు అధికారులు వివరించారు. నిందితులను అదుపులోకి తీసుకుని మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుస్తామని తెలిపారు.

**నష్టాన్ని బాధ్యుల నుంచే వసూలు చేయాలి**

ప్రజల సౌకర్యార్థం నిర్మించిన మౌలిక వసతులను ధ్వంసం చేయడాన్ని ఉప ముఖ్యమంత్రి తీవ్రంగా తప్పుబట్టారు. రహదారిని ధ్వంసం చేసిన ప్రత్యక్ష బాధ్యులతో పాటు, వారి వెనుక ఉండి ప్రోత్సహించిన వారిని కూడా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిందితులపై నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.

**ప్రజాధనానికి నష్టం కలిగిస్తే చర్యలు తప్పవు**

ధ్వంసమైన రహదారి మరమ్మతులకు అయ్యే వ్యయాన్ని బాధ్యుల నుంచే వసూలు చేసేలా రెవెన్యూ రికవరీ చట్టం కింద చర్యలు చేపట్టాలని పవన్ కల్యాణ్ అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని సూచించారు.

# ప్రాణహిత నీటిని మళ్లించేందుకు కాఫర్ డ్యాం నిర్మించాలి.

- **నవంబర్ నెలాఖరులోగా పనులు చేపట్టాలి.**
- **రూ. 25 కోట్లతో నెలన్నరలో నిర్మాణం పూర్తి చేయొచ్చు.**
- **మేడిగడ్డను సాకుగా చూపి రైతులకు అన్యాయం చేయొద్దు.**
- **ప్రభుత్వానికి కల్వకుంట్ల కవిత ప్రతిపాదన.**




**కన్నేపల్లి, మహా**: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నేపల్లి (లక్ష్మి) పంపుహౌస్ వద్ద ప్రాణహిత నది ప్రవాహాన్ని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ప్రాణహిత నీటిని వినియోగించుకునేందుకు కన్నేపల్లి వద్ద కాఫర్ డ్యాం నిర్మించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. నవంబర్ నెలాఖరులోగా నిర్మాణ పనులు చేపట్టకపోతే పంపుహౌస్ వద్ద ఆందోళన నిర్వహిస్తామని ప్రకటించారు. కన్నేపల్లి పంపుహౌస్ వద్ద 93 మీటర్లకు పైగా ఎత్తులో కాఫర్ డ్యాం నిర్మిస్తే ప్రాణహిత జలాలను మళ్లించుకునే అవకాశం ఉంటుందని కవిత పేర్కొన్నారు. సుమారు రూ. 25 కోట్ల వ్యయంతో నెలన్నర రోజుల్లో పనులు పూర్తి చేయవచ్చని తెలిపారు. ఈ ప్రతిపాదన అమలుకు అవసరమైన సాంకేతిక వివరాలను ప్రభుత్వానికి అందిస్తామని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీపై ఆధారపడకుండా అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు నీటిని ఎత్తిపోసి, ప్రాజెక్టుల జలాశయాలను నింపుకునే అవకాశం ఉంటుందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు సాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారని కవిత అన్నారు. గోదావరి, కృష్ణా నదుల జలాలను సమర్థంగా వినియోగించుకుంటే కరువు పరిస్థితులను ఎదుర్కొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో నీటి హక్కుల కోసం పోరాడామని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా అందుబాటులో ఉన్న జలాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోలేకపోయామని వ్యాఖ్యానించారు.

**బీఆర్ఎస్ హయాంలో ఖర్చులపై విమర్శలు**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టులపై సుమారు రూ. 1.80 లక్షల కోట్లు ఖర్చు చేసినా ప్రధానంగా పాత ఆయకట్టును స్థిరీకరించడానికే ప్రాధాన్యం ఇచ్చారని కవిత ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కొత్తగా లక్ష ఎకరాలకు మాత్రమే నీరు అందించారని పేర్కొన్నారు. ప్రాజెక్టు కోసం సుమారు రూ. 93 వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ, కాలువల నిర్మాణం పూర్తికాకపోవడంతో అదనంగా 19 లక్షల ఎకరాలకు నీరు అందించే లక్ష్యం నెరవేరలేదని విమర్శించారు. ఆ కాలువల నిర్మాణానికి మరో రూ. 50 వేల కోట్లు అవసరమవుతాయని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి ప్రాజెక్టులపై రూ. 26 వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ, కొత్తగా ఒక్క ఎకరానికీ నీరు అందించలేదని కవిత ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, దళిత బంధు వంటి పథకాల బకాయిలు చెల్లించకుండా కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేయడంపై ప్రశ్నించారు. రైతులకు అవసరమైన నీరు, విద్యుత్తు అందించడంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

జలాశయాల్లో తగ్గుతున్న నీటి నిల్వలు

ఎల్లంపల్లి సహా పలు జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోయాయని కవిత పేర్కొన్నారు. ఎల్లంపల్లిలోని నీటిని తాగునీటి అవసరాల కోసం నిల్వ ఉంచినట్లు తెలిపారు. రాష్ట్రంలో 21 వేల చెరువులు ఎండిపోయాయని, దీంతో మత్స్యకారులకు ఉపాధి సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. రానున్న నెలల్లో కరువు పరిస్థితులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులకు ఇదే సరైన సమయమని కవిత పేర్కొన్నారు. మరమ్మతులతో పాటు కన్నేపల్లి వద్ద కాఫర్ డ్యాం నిర్మాణ ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. ప్రతిపాదనలో సాంకేతిక మార్పులు అవసరమైతే ఇంజినీర్ల సూచనల మేరకు సవరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రైతులకు నీరు, విద్యుత్తు అందించే అవకాశం ఉన్నప్పటికీ చర్యలు తీసుకోకపోతే కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు.

# అతివేగం ఇద్దరు యువకుల ప్రాణాలు బలి

- **చెట్టును ఢీకొన్న ఆర్15 బైక్.. ఇద్దరూ అక్కడికక్కడే మృతి.**
- **జార్ఖండ్‌కు చెందిన కాస్మోస్, సుమిత్ దుర్మరణం**

**శామీర్‌పేట, మహా:** హైదరాబాద్ శివారులోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంతో వెళ్తున్న యమహా ఆర్15 బైక్ అలియాబాద్ వద్ద చెట్టును ఢీకొట్టడంతో జార్ఖండ్‌కు చెందిన ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. మృతులను కాస్మోస్ మార్కి (22), సుమిత్ కుల్లు (23)గా పోలీసులు గుర్తించారు. కాస్మోస్ అలియాబాద్‌లో నివాసం ఉంటుండగా, సుమిత్ బాలానగర్‌లో ఉంటున్నాడు. వీరిద్దరూ అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని డైనమిక్ కంపెనీలో పనిచేస్తున్నారు. కంపెనీ నిర్వహించిన విందుకు హాజరై, ఆదివారం అర్ధరాత్రి బైక్‌పై తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. అలియాబాద్ ఎక్స్ రోడ్డు నుంచి గ్రామం వైపు వెళ్తున్న సమయంలో బ్రిందా రెడ్డి కన్వెన్షన్ సమీపంలో బైక్ చెట్టును ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జీనోమ్ వ్యాలీ పోలీసు ఇన్‌స్పెక్టర్ గురువయ్య గౌడ్ తెలిపారు.







# ఆధునిక అధర్మస్య ఉపరి ధర్మస్య అజేయ విజయః



**• కాలగర్భంలో నిక్షిప్తమైన ధర్మ విజయ శాసనం 'విజయదశమి'.**

**శమీ శమయతే పాపం శమీ శత్రువినాశనీ ।**
**అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియదర్శినీ ॥**

శమీ (జమ్మి) వృక్షం పాపాలను పోగొడుతుంది, శత్రువులను నాశనం చేస్తుంది. ఇది అజ్ఞాతవాస సమయంలో అర్జునుని ఆయుధాలను భద్రపరిచిన చెట్టు , లంకా దండయాత్రకు ముందు శ్రీరాముడికి విజయానికి సూచికగా దర్శనమిచ్చిన చెట్టు. (అందుకే జమ్మి చెట్టును దర్శించడం, పూజించడం సకల శుభాలను ప్రసాదిస్తుందని ప్రగాఢ విశ్వాసం).

శరత్కాలపు స్వచ్ఛతను పుణికిపుచ్చుకున్న ఆశ్వయుజ దశమి, కేవలం క్యాలెండర్‌లోని ఒక సాధారణ పర్వదినం కాదు. అది యుగయుగాలుగా భారతీయ సామాజిక ఆత్మలో ప్రవహిస్తున్న నైతిక చైతన్యానికి సజీవ దర్పణం. పౌరాణిక ఆఖ్యానాలకు, గతకాలపు కథనాలకు అతీతంగా, శుద్ధ సామాజిక శాస్త్ర నికోషంపై విజయదశమి అనేది పతనమవుతున్న మానవీబయ విలువల మధ్య సమాజం నిలబెట్టుకుంటున్న ఒక ఉజ్వలమైన దార్శనిక తీర్మానం. అధర్మం, అహంకారం, అవినీతి లాంటి వర్తమాన సామాజిక జాడ్యాలపై సత్యం ఎప్పటికైనా పైచేయి సాధిస్తుందన్న నిఖార్సైన వాస్తవం.

వ్యవస్థాగత అరాచకాలు, స్వార్థపూరిత ధోరణులు ఆధునిక అసుర శక్తులుగా రూపాంతరం చెంది సామాన్యుడిని పీడిస్తున్న తరుణంలో, ఈ పర్వదినం ఒక అద్భుతమైన సామాజిక సంస్కరణాస్త్రంగా మన కళ్ల ముందు నిలుస్తోంది. ప్రతి ఏడాదీ జరిగే రాక్షస దహన క్రియల వెనుక ఉన్న నిగూఢ పరమార్థం బాహ్య శత్రువుల భౌతిక సంహారం కాదు; మనిషి అంతరంగంలో గూడుకట్టుకున్న కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలతో పాటు అహంకారాన్ని సమూలంగా దహించివేయడం. వ్యవస్థలోని చీకటి కోణాలను నిర్భయంగా వెలుగులోకి తెస్తూ, నైతికతను పునరుద్ధరించాలంటూ సామాజిక మనస్సాక్షి చేస్తున్న ఒక కఠోరమైన తపస్సు ఇది. చట్టం, న్యాయం నిర్వీర్యమైనట్లు కనిపించిన ప్రతిసారీ, ఒక అంతర్గత నైతిక శక్తి ఉప్పెనలా లేచి సామాజిక సమతౌల్యాన్ని సాధిస్తుందన్న తీవ్రమైన హెచ్చరిక ఇందులో అంతర్లీనంగా ప్రతిధ్వనిస్తోంది.

ఈ పర్వదిన వాతావరణంలో ప్రస్ఫుటంగా కనిపించే ఆయుధ పూజా ఘట్టం.. శ్రమ జీవన సౌందర్యానికి, వృత్తి నైపుణ్యానికి సమాజం అందించే అత్యున్నత గౌరవానికి ప్రతీక. ఇది కేవలం భౌతిక పరికరాల ఆరాధన కాదు; ఆధునిక సాంకేతిక, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో కర్షకుడి నాగలి కర్రు నుండి అంతరిక్ష శాస్త్రవేత్త ప్రయోగించే రాకెట్ వరకు, సామాన్యుడి సమ్మెట నుండి వ్యవస్థలను మేల్కొల్పే పాత్రికేయుడి కలం వరకు... సకల వృత్తి నైపుణ్యాలకు దక్కిన అరుదైన 'సంపాదకీయ గుర్తింపు'. నిరుద్యోగం, దారిద్ర్యం లాంటి సామాజిక, ఆర్థిక సవాళ్లను స్వశక్తితో ఎదుర్కోవాలన్న నిశ్శబ్ద విప్లవానికి ఇది నాంది. శ్రమదోపిడీ రహిత వ్యవస్థకు, కర్మ సిద్ధాంతానికి మారుపేరుగా నిలుస్తూ, వృత్తి పట్ల అంకితభావమే వాస్తవిక ధర్మసంస్థాపన అని నవీన తరానికి నిర్దేశిస్తోంది.

ఇక విపరీతమైన యాంత్రికీకరణతో, డిజిటల్ తెరల వెనుక బందీలై ఏకాకిగా మారుతున్న ఆధునిక మానవుడిని వాస్తవిక ప్రపంచంలోకి నడిపించే ఒక మహోత్తరమైన సోషియోసైకలాజికల్ వారధి ఈ పండుగ. వర్గ, వర్ణ, ఆర్థిక, హోదా తారతమ్యాలను విస్మరించి, తరాల అంతరాలను పటాపంచలు చేస్తూ, ప్రకృతి ప్రసాదించిన పత్రాలను ఆత్మీయతకు ప్రతీకలుగా పంచుకునే సంప్రదాయం 'వసుధైక కుటుంబ' భావనకు ప్రబల నిదర్శనం. కాంక్రీట్ అడవుల్లో విచ్ఛిన్నమవుతున్న మానవ సంబంధాలకు పునరుజ్జీవం పోస్తూ, అపార్ట్‌మెంట్ల సంస్కృతిలో ముడుచుకుపోయిన మనిషిని పక్క మనిషితో కలిపే ఒక సాంస్కృతిక సంధానకర్తగా దసరా ఉత్సవం సామాజిక ప్రాముఖ్యతను సంతరించుకుంది. విజయదశమి అంటే గడిచిపోయిన కాలపు విజయాల నెమరువేత ఎంతమాత్రమూ కాదు. భవిష్యత్ సామాజిక నిర్మాణానికి అవసరమైన ఆత్మవిశ్వాసానికి, నిరంతర ఆత్మపరిశీలనకు అది ఒక మేలుకొలుపు. నిరాశానిస్పృహల అంధకారాన్ని చీల్చుకుంటూ, అలుపెరగని సత్యాన్వేషణ, చెక్కుచెదరని నిబద్ధతలతో ధర్మపథంలో సాగించే ప్రతి అడుగూ అంతిమంగా విజయపథమే అవుతుందని కాలానుగుణంగా ఈ పర్వదినం ఘంటాపథంగా చెబుతోంది. సంకుచిత స్వభావాలను వీడి, విశాల దృక్పథంతో సమసమాజ నిర్మాణానికి నిరంతరం కార్యోన్ముఖులు కావడమే మనం ఈ పర్వదినానికి అర్పించే అసలైన అక్షర నీరాజనం.

**గడల నరసింహారావు.**
**అసోసియేట్ ఎడిటర్, మహాపత్రిక**




## చర్మానికి మెరుపు కోసం ఐవీ డ్రిప్స్..
# ఆరోగ్యానికి ముప్పు తప్పదా?

**అందం కోసం చేసే ప్రయోగాలతో కిడ్నీలు, కాలేయానికి ప్రమాదం.. వైద్యుల పర్యవేక్షణ తప్పనిసరి**

అందంగా, మెరిసే చర్మంతో కనిపించాలనే కోరికతో చాలామంది కొత్తకొత్త సౌందర్య చికిత్సలను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల ప్రాచుర్యంలోకి వచ్చిన వాటిలో స్కిన్ గ్లో ఐవీ డ్రిప్స్ ఒకటి. అయితే తక్కువ సమయంలో చర్మం కాంతివంతంగా మారుతుందనే ప్రచారాన్ని నమ్మి వీటిని వినియోగించడం ఆరోగ్యానికి ముప్పు కలిగించవచ్చని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ఏమిటీ ఐవీ డ్రిప్స్?**

ఐవీ (ఇంట్రావీనస్) డ్రిప్స్ ద్వారా కొన్ని పదార్థాలను నేరుగా రక్తప్రవాహంలోకి పంపిస్తారు. చర్మ సౌందర్యం కోసం ఉపయోగించే కొన్ని డ్రిప్స్‌లో గ్లూటాథయోన్, విటమిన్ సి వంటి పదార్థాలను కలుపుతుంటారు. ఇవి చర్మాన్ని కాంతివంతంగా మార్చుతాయని, రంగులో మార్పు తీసుకొస్తాయని ప్రచారం జరుగుతోంది. అయితే చర్మం తెల్లబడటానికి ఈ చికిత్స ఎంతవరకు ప్రభావవంతంగా ఉంటుందనే అంశంపై బలమైన శాస్త్రీయ ఆధారాలు పరిమితంగానే ఉన్నాయి. దీర్ఘకాలిక భద్రతపైనా మరింత పరిశోధన అవసరం.

**దుష్ప్రభావాలు ఉంటాయా?**

ఈ డ్రిప్స్ తీసుకున్న కొందరిలో వికారం, తలనొప్పి, తలతిరగడం, ఇంజెక్షన్ ఇచ్చిన చోట వాపు, మంట వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో తీవ్రమైన అలర్జీలు, ఇన్ఫెక్షన్లు, రక్తనాళాల వాపు వంటి సమస్యలు కూడా ఎదురుకావచ్చు. అధిక మోతాదులో విటమిన్ సి ఇవ్వడం వల్ల కొందరిలో కిడ్నీ సమస్యలు, రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. ఇప్పటికే కిడ్నీ, కాలేయం లేదా గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలి.

**నిపుణుల సూచనలే ముఖ్యం**

అర్హత కలిగిన వైద్యులు, అవసరమైన అత్యవసర చికిత్స సదుపాయాలు లేని బ్యూటీ క్లినిక్‌లు లేదా సెలూన్లలో ఇలాంటి డ్రిప్స్ తీసుకోవడం ప్రమాదకరం. గర్భిణులు, పాలిచ్చే తల్లులు వైద్యుల ప్రత్యేక సూచన లేకుండా ఈ తరహా సౌందర్య చికిత్సలకు దూరంగా ఉండాలి. చర్మం మెరుపు కోసం సమతుల ఆహారం, తగినంత నీరు, సన్‌స్క్రీన్ వినియోగం, క్రమబద్ధమైన చర్మ సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు.హైదరాబాద్‌కు చెందిన యశోదా ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కె. శేషి కిరణ్ సూచనల ప్రకారం, సౌందర్యం కోసం చేసే చికిత్సల్లోనూ భద్రతకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. చర్మ సమస్యలు ఉంటే స్వయంగా చికిత్సలు ఎంచుకోకుండా అర్హత కలిగిన చర్మ వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం.



ANN తెలుగు

మహా పత్రిక 05

మంగళవారం, హైదరాబాద్ | 20-10-2026 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM




## ఎన్.హెచ్.ఎం. ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి
- మంచిర్యాల కలెక్టర్ కార్యాలయం ముందరి దీక్షకు సంఘీభావం

**మంచిర్యాల, మహా ప్రతినిధి** : ఎన్.హెచ్.ఎం. ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి డిమాండ్ చేశారు. ఎన్.హెచ్.ఎం. ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందర ఆ ఉద్యోగులు చేస్తున్న దీక్షకు ఆదివారం ఆయన హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్.హెచ్.ఎం. ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు vతక్షణమే రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఎన్.హెచ్.ఎం. ఉద్యోగుల దీక్షకు బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులను సకాలంలో చెల్లిస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు చెల్లించడంలో జాప్యం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండిస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బేర సత్యనారాయణ, కుర్రె చక్రి, అమిరిశెట్టి రాజ్ కుమార్, పల్లి రాకేష్, ఈర్ల సదానందం తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూర్‌ను ఆధునిక పట్టణంగా అభివృద్ధి చేస్తాం

- తెలంగాణ కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద

**చెన్నూర్/మంచిర్యాల, మహా ప్రతినిధి** : చెన్నూర్ పట్టణాన్ని అన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం చెన్నూర్ పట్టణంలోని 15వ వార్డులో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందుగా పట్టణంలో రోడ్డు విస్తరణకు సహకరిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయిన వారికి 70 షాపుల కేటాయింపు 34 నెలల్లో పూర్తి చేస్తామని అన్నారు.ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి 1.60 కోట్ల రూపాయలతో బైపాస్ రోడ్డు, గోదావరి పుష్కరాలకు 6 కోట్ల రూపాయల తో ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. చెన్నూర్ శివాలయ అభివృద్ధికి 17 కోట్లు కేటాయించామని వెల్లడించారు. అంతేకాకుండా వ్యవసాయ మార్కెట్ కు 20 లక్షలు, సోమనపల్లిలో 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల,ప్రతిరోజూ 20 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం పథకం అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పట్టణంలో సీసీ డ్రైనేజీలు, నాన్ వెజ్ మార్కెట్, మరుగుదొడ్లు, కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మ, కమిషనర్ మురళీకృష్ణ, తహసిల్దార్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



**ఆసుపత్రిని సందర్శించిన మంత్రి**

చెన్నూర్ పట్టణంలోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి గడ్డం వివేకానంద ఆకస్మికంగా సందర్శించారు. క్యాజువాలిటీ విభాగం, అత్యవసర సేవలు, రోగులకు అందుతున్న చికిత్సను పరిశీలించారు. అనంతరం సిబ్బంది హాజరు, మందుల లభ్యతపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోగికి నాణ్యమైన వైద్యం అందించాలని, అవసరమైన పరికరాలు సమకూర్చాలని ఆదేశించారు. ఆర్వో ప్లాంట్ ను పరిశీలించి శుద్ధి తాగునీరు అందించాలని సూచించారు.ఆ తర్వాత మధన పోచమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన ఆలయ కమిటీ చైర్ పర్సన్ సతీష్ తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



## క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంత్రి హామీ

మందమర్రి, మహా : మందమర్రి మండలంలో క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు అవసtరమైన నిధులు మంజూరు చేస్తానని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానంద హామీ ఇచ్చారు.సోమవారం మందమర్రి మండలం షాలోమ్ పాస్టర్స్ ఫెలోషిప్ పాస్టర్లు స్థానిక కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మంద తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. క్రైస్తవులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన మంత్రి, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కావాల్సిన నిధులు మంజూరు చేస్తానని, స్థల సేకరణ చేపట్టి వెంటనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో షాలోమ్ ఫెలోషిప్ నాయకులు ఎలియా, ఆనంద్, జాన్ ప్రసాద్, శామ్యూల్ రాజ్, ఏసుదాస్, సొల్మన్, ఉపేందర్, తిమోతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కమ్యూనిటీ హాల్ కు హామీ ఇచ్చిన మంత్రికి పాస్టర్లు కృతజ్ఞతలు తెలిపారు.



## మందమర్రి శివారులో పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ దాడి

- ఆరుగురు అరెస్ట్, 86 వేల నగదు స్వాధీనం

**మందమర్రి, మహా** : మందమర్రి శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని స్థానిక పోలీసులు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు నార్కోటిక్ టీమ్ / టాస్క్ ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు, ఎస్ఐ దీకొండ రమేష్, ఆర్ఎస్ఐ ప్రవీణ్ సిబ్బందితో మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని శివారు ప్రాంతంలో దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అదుపులోకి తీసుకున్న వారి నుంచి 86,230 రూపాయల నగదు, 6 సెల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో వడ్డే కుమార్ (బెల్లంపల్లి),దురిశెట్టి శ్రీనివాస్ ( బెల్లంపల్లి),కర్ణ వెంకటేష్ (మందమర్రి), సల్లు సతీష్ (మందమర్రి), సల్ల సాధానందం (మందమర్రి), కొట్టే కిషోర్ (బెల్లంపల్లి) లు ఉన్నారు. స్వాధీనం చేసుకున్న నగదు, సెల్ ఫోన్లు, బైక్ తో సహా నిందితులను చట్టపరమైన చర్యల నిమిత్తం మందమర్రి పోలీస్ స్టేషన్ కు అప్పగించినట్లు వారు వివరించారు.




## స్వేచ్ఛా రథాన్ని ప్రారంభించిన కలెక్టర్

**నిర్మల్ మహా**: రాష్ట్రవ్యాప్తంగా వెట్టి చాకిరి నిర్మూలన, కార్మికుల హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని సోమవారం నిర్మల్ కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ భవేశ్ మిశ్రా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెట్టి చాకిరి వల్ల కలిగే అనర్థాలు, దాని నిర్మూలనకు ఉన్న చట్టాలు, కార్మికులకు కల్పించిన హక్కులపై నాటికలు, పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించే ఈ ప్రచార రథం ద్వారా వ్యవసాయ రంగం, ఇటుక బట్టీలు, మైనింగ్, క్వారీలతో పాటు ఇతర రంగాల్లో పనిచేసే అసంఘటిత కార్మికులకు తమ హక్కులపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వెట్టి చాకిరికి గురైన వారు, అలాంటి ఘటనలను గుర్తించిన వారు వెంటనే ఫిర్యాదు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 08069434343ను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.అనంతరం వెట్టి చాకిరి నిర్మూలనకు సంబంధించిన గోడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెట్టి చాకిరి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, కార్మిక శాఖ అధికారి రాజలింగం, ప్రచార రథం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బాధితుల పక్షాన పోలీసు వ్యవస్థ ఉండాలి

- సమస్యలను సత్వరమే పరిష్కరించాలి
- జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి
- 28 ప్రజా ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ

**ఆదిలాబాద్ మహా**: ఆదిలాబాద్ జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా మొత్తం 28 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకురాగా, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ వెంటనే సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, బాధితుల సమస్యలపై సత్వరమే దర్యాప్తు చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు వ్యవస్థ ఎల్లప్పుడూ బాధితుల పక్షాన నిలబడుతుందని, ప్రజలకు న్యాయం అందించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని అన్నారు. ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక చర్యలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం ఉన్నా 8712659973 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేయవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని జిల్లా ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారి జైస్వాల్ కవిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ విజయరమణ రావు

**పెద్దపల్లి మహా** : పెద్దపల్లి మండలం రాఘవాపూర్ (గొల్లపల్లి) గ్రామంలో రూ.10 లక్షల నిధులతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు శంకుస్థాపన చేశారు. స్థానిక నాయకులతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో రహదారి సౌకర్యాలను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## కొమురం భీం వర్ధంతి పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్

**ఆదిలాబాద్ మహా**: ఈ నెల 26న జోడేఘాట్‌లో నిర్వహించనున్న కొమురం భీం వర్ధంతి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ రాజర్షి షా ఆవిష్కరించారు. ఆదివాసీ నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో ఆయనను కలిసి కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ నిర్వాహకులు ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## డప్పు కళాకారులకు దుస్తుల పంపిణీ

- సాయంపేటలో మాజీ ఉప సర్పంచ్ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం

**పెద్దపల్లి మహా** : పెద్దపల్లి జిల్లా సాయంపేట గ్రామంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపీపీ, నంది మ్యాడారం పీఏసీఎస్ చైర్మన్ ముత్యాల కరుణశ్రీ బలరాం రెడ్డి ఆధ్వర్యంలో డప్పు కళాకారులకు టీ షర్టులు, ప్యాంట్లు పంపిణీ చేశారు. సాయంపేట మాజీ ఉప సర్పంచ్ బద్దం శ్యామల తిరుమల రెడ్డి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డప్పు కళాకారులను ప్రోత్సహించడంతో పాటు వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బద్దం లక్ష్మీపతి రెడ్డి, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు బోలిశెట్టి సుధాకర్, బోలిశెట్టి చుక్కయ్య, పబ్బతి స్వామి, శేఖర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, ఆనందరెడ్డి, లింగ రెడ్డి, సతీష్ రెడ్డి, బొల్లం శ్రీనివాస్, పొన్నం వెంకటేష్, చీకట్ల తిరుపతి, దూడ చుక్కయ్య, సురేష్, వీరేశం, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.




## ప్రజల సమస్యల పరిష్కారమే పోలీస్ శాఖ లక్ష్యం

- సీపీ అంబర్ కిషోర్ ఝా

**పెద్దపల్లి మహా**: రామగుండం: ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించి, బాధితులకు తక్షణ భరోసా కల్పించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను ఓపికగా తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఎప్పుడైనా సీపీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ఆపదలో ఉన్నవారికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు. వాటిపై వెంటనే స్పందించిన సీపీ, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చట్ట పరిధిలోని ప్రతి ఫిర్యాదుపై ఎలాంటి జాప్యం లేకుండా పారదర్శకంగా విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులకు సంబంధించిన ఫిర్యాదుల విషయంలో అత్యంత సున్నితంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.



## పంచాయతీ సిబ్బందికి నిత్యావసర వస్తువుల పంపిణీ

**పెద్దపల్లి మహా**: కాల్వ శ్రీరాంపూర్: దసరా పండుగను పురస్కరించుకుని కాల్వ శ్రీరాంపూర్ గ్రామ పంచాయతీ సిబ్బందికి నిత్యావసర వస్తువులను పంపిణీ కార్యక్రమం సర్పంచ్ బంగారి రమేష్ చేతుల మీదుగా సిబ్బందికి నూనె ప్యాకెట్లు, గోధుమ పిండి ప్యాకెట్లు, సబ్బులను అందజేశారు. ఈ కార్యక్రమానికి మంతెన లక్ష్మణ్ దాతగా వ్యవహరించారు. గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న పంచాయతీ సిబ్బందిని ప్రోత్సహించడంతో పాటు, పండుగ సందర్భంగా వారికి సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి పంచాయతీ సిబ్బందికి నిత్యావసర వస్తువులను అందించేందుకు సహకరించిన దాత మంతెన లక్ష్మణ్‌ను గ్రామస్థులు, పంచాయతీ ప్రతినిధులు అభినందించారు.

## ప్రజావాణిపై ప్రజల అసహనం..

- ప్రజా సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం మూడు ఫిర్యాదులే సాక్ష్యం..

**రాజేంద్రనగర్ మహా** : షాబాద్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం 2026 ఆగస్టు 17న అధికారికంగా ప్రారంభమైంది. జల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజావాణి' కార్యక్రమం క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదని ప్రజాసంఘాలు అభిప్రాయపడుతున్నాయి. సోమవారం శంషాబాద్ మండలంలోని ప్రజావాణిలో సమర్పించిన మూడు అర్జీలు సాక్ష్యం. ప్రజావాణికి దాదాపు 23 ముఖ్య శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలి.

కానీ శంషాబాద్ మండలం ప్రజావాణిలో ఏనాడు 23 శాఖల అధికారులు హాజరు కాలేదు. సమస్యలపై అధికారులు స్పందించకపోవడంపై బాధితులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ర్యాలయాల చుట్టూ తిరగలేక, తమ సమస్యలు నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తే పరిష్కారం దొరుకుతుందని బాధితులు ఎంతో నమ్మకంతో ప్రజావాణిని ఆశ్రయించారు. అయితే, అర్జీలు సమర్పించి రోజులు గడుస్తున్నా అధికారుల నుంచి స్పందన కరువైందని ఆవేదన చెందుతున్నారు. కేవలం అర్జీలు తీసుకోవడమే తప్ప, వాటిని పరిష్కరించడంలో అధికారులు, యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రజాసంఘాలు విమర్శిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, అర్జీలపై తక్షణమే విచారణ జరిపి సమస్యలను పరిష్కరించాలని బాధితులు కోరుతున్నారు.

## ద్వారకాపురి కాలనీలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**ఆటపాటలతో సందడి చేసిన మహిళలు**

కుషాయిగూడ, మహా : ద్వారకాపురి కాలనీలో సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను నడిబజారులో ఏర్పాటు చేసి, సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో సందడి చేశారు. కాలనీకి చెందిన దామరపల్లి లత, దామరపల్లి హర్షిని రెడ్డి, దీపికతో పాటు పలువురు మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. అనంతరం 'పోయి పోయి రావమ్మా బతుకమ్మ' అంటూ బతుకమ్మకు ఘనంగా వీడ్కోలు పలికారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను భావితరాలకు అందిస్తూ, ఈ పండుగ విశిష్టతను ప్రపంచవ్యాప్తంగా చాటాలని మహిళలు ఆకాంక్షించారు. కాలనీలో బతుకమ్మ వేడుకలు పండుగ వాతావరణాన్ని నింపాయి.



# దసరా పండుగను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించాలి

- **కుషాయిగూడ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి**

**కుషాయిగూడ, మహా** : దసరా పండుగ సందర్భంగా నిర్వహించే బతుకమ్మ వేడుకలు, రావణ దహనం, దుర్గామాత విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశామని కుషాయిగూడ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ లెంకల భాస్కర్ రెడ్డి చెప్పారు. సోమవారం. విలేకరులతో మాట్లాడుతూ పండుగ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై కుషాయిగూడ. పోలీస్ అధికారులతో. సిబ్బందితో. ఎస్ఐలతో. సమీక్షా సమావేశం నిర్వహించి, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ (పి పి టి) ద్వారా పలు సూచనలు, మార్గదర్శకాలను వివరించారు. కుషాయిగూడ వ్యాప్తంగా దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించిన నేపథ్యంలో, ప్రతి విగ్రహం నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిమజ్జన మార్గాలను ముందుగానే పరిశీలించి, అవసరమైన ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కాప్రా చెరువు వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నిమజ్జన సమయంలో చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఉత్సవ నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ ప్రాంతాల్లో నిర్వహించే రావణ దహన కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో జనసమూహాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజల భద్రతకు సంబంధించి పటిష్టమైన ఏర్పాట్లు ఏం చేస్తున్నామన్నారు. కార్యక్రమాలు జరిగే ప్రదేశాలను ముందుగానే పరిశీలించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తుగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రావణ దహనం, దుర్గామాత విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలన్నీ ప్రశాంతంగా జరిగేలా అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టిస్తే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

### డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లోని

# ప్రజల జీవనం అస్తవ్యస్తం

- **వైతరణి నదిని తలపిస్తున్న భూగర్భ జలాలు.**
- **పరిసర ప్రాంత ప్రజల నిత్య నరకయాతన శ్వాసకోశ జబ్బులు.**
- **డంపింగ్ యార్డ్ ఎత్తివేతకు జేఏసీకి అండగా నిలవండి.**
- **ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డికి వినతి పత్రం సమర్పణ.**



**జవహర్ నగర్, మహా** : డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లోని ప్రజల జీవనం అస్తవ్యస్తంగా తయారైందని పరిసర ప్రాంతాల నీటి వనరులు వైతరణి నదిని తలపిస్తున్నాయని డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంత ప్రజలు నిత్యం నరకయాతన శ్వాసకోశ జబ్బులతో బాధపడుతున్నారని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ పేర్కొన్నది. జవహర్ నగర్ లోని రాంకీ చెత్త డంపింగ్ యార్డ్ ని శాశ్వతంగా ఎత్తివేయాలని విజ్ఞప్తి చేస్తూ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సైనికపురి పార్టీ కార్యాలయాల్లో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కి డంపింగ్ యార్డ్ వలన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. గత 20 సంవత్సరాలుగా జవహర్ నగర్ రాంకీ డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల సుమారు 20 కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతాలైన కాప్రా, దమ్మాయిగూడ, చర్లపల్లి ,నాగారం, ఘట్కేసర్, కీసర ప్రాంతాల్లోని ప్రజలు ప్రత్యక్షంగా 10 లక్షల మంది పరోక్షంగా 30 లక్షల మంది ప్రజలు ఈ డంపింగ్ యార్డ్ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. అహమ్మద్ గూడ, కార్మిక నగర్ ,శాంతి నగర్, గబ్బిలాలపేట, ఈస్ట్ నందమూరి నగర్, అంబేద్కర్ నగర్ లాంటి కాలనీల లోని చిన్న పిల్లలు వృద్ధులు ఇండ్లలో ఉండలేని దారుణమైన పరిస్థితులు నెలకొని ఉన్నాయని వివరించారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ డంపింగ్ యార్డ్ ను శాస్త్రీయమైన పద్ధతిలో శాశ్వతంగా మూసివేసి బయోమైనింగ్ ద్వారా శుభ్రపరచాలని డంపింగ్ యార్డ్ బాధిత ప్రాంతాల ప్రజలకు యుద్ధ ప్రాతిపదికన స్వచ్ఛమైన తాగునీరు వైద్య సదుపాయం కల్పించేలా ముఖ్యమంత్రి ప్రభుత్వ అధికారులు కృషి చేయాలని తెలిపారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని నియోజకవర్గ ప్రజలపై కూడా డంపింగ్ యార్డ్ ప్రభావం తీవ్రంగా



ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ షేక్షావలి, కన్వీనర్ ఉమామహేష్, కోశాధికారి శివ బాబు, వివిఎస్ బోసు, దామోదర్ రెడ్డి, గడ్డం సదానందం, ఆంజనేయులు, బిర్రు యాక స్వామి, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ మహమ్మద్ పాషా మియా, టి. కలేశా, సునీత, మోనార్ దుర్గాప్రసాద్ శ్రవణ్ కుమార్, డంపింగ్ యార్డ్ బాధిత ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## విజయ దుర్గా మల్లేశ్వర ఆలయంలో భోజనశాల ప్రారంభం

**పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

కుషాయిగూడ, మహా : కాప్రాలోని జై జవాన్ కాలనీలో ఉన్న శ్రీశ్రీశ్రీ విజయ దుర్గా మల్లేశ్వర ఆలయంలో శ్రీశ్రీశ్రీ విద్యారణ్య సదనం భోజనశాల ప్రారంభోత్సవ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, స్వామీజీ వారి ఆశీస్సులు భక్తులకు లభించాయి. భక్తులకు అన్నప్రసాద వితరణ, సేవా కార్యక్రమాలకు ఉపయోగపడేలా భోజనశాల ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు బిఆర్ ఎస్ పార్టీ నాయకులు మైపాల్ రెడ్డి, మురళి పంతులు, షేర్ మణమ్మ తదితరులు పాల్గొన్నారు.



## బండ్యా సంఘం ఆధ్వర్యంలో దుర్గ ఉత్సవం

- **పాల్గొన్న ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా** : మల్లాపూర్‌లో బంగీయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ శ్రీ శారదీయ దుర్గోత్సవం-2026 వేడుకలు ఘనంగా కొనసాగాయి. మూడో సంవత్సరం నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ఉప్పల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ వేడుకల్లో బంగీయ సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు పాల్గొన్నారు.



## ఏటీఎం దోపిడీ కేసులో రాజస్థాన్‌కు చెందిన ప్రధాన నిందితుడు అరెస్ట్

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాతాంరాయిలో క్విస్ బ్యాంక్ ఏటీఎం చోరీ కేసు సంచలనం సృష్టించింది. తాంరాయి లోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం రీ కేసును శంషాబాద్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఛేదించారు.. రాజస్థాన్‌కు చెందిన రషీద్ అనే నిందితుడిని అరెస్ట్ చేశారు. షాబాద్ డిసిపి కార్యాలయంలో డీసీపీ రాజేష్ సోమవారం వివరాలను వెల్లడించారు. నెల 6వ తేదీన గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను కట్ చేసి, సీసీ కెమెరాలపై పెయింట్ స్ప్రే చేసి సుమారు 7 లక్షల 40 వేల రూపాయల నగదును చోరీ చేశారు. కేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు. శంషాబాద్‌లోని గొల్లపల్లి ఎక్స్ రోడ్స్ వద్ద నిందితుడు రషీద్ అలియాస్ కాకను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి కోంతగదు, శాంట్రో కారు, పల్సర్ బైక్, గ్యాస్ కట్టర్ పరికరాలు, సిలిండర్, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ లక్షా 84 వేల 500 రూపాయలుగా పోలీసులు వెల్లడించారు. నిందితుడు రషీద్‌పై గతంలో 46 కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ముఠాకు చెందిన మరో నలుగురు పరారీలో ఉండగా, వారి కోసం గాలింపు కొనసాగుతోంది. షాబాద్ ఏటీఎం చోరీతో పాటు పహాడీషరీఫ్‌లో బైక్ చోరీ, సైదాబాద్‌లో కారు చోరీ కేసుల్లోనూ నిందితుల ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసును చేదించిన డిఐ, పవన్ కుమార్, టాస్క్‌ఫోర్స్‌ సిబ్బంది తదితరులను డిసిపి, అడిషనల్ డిసిపి కె ఎస్ రావు, ఏసిపి శ్రీకాంత్ గౌడ్ అభినందించారు.



## జర్నలిస్టుల సంక్షేమం కోసం ఐజేయూ కృషి చేస్తోంది

- **ఐజేయు ప్రధాన కార్యదర్శి సోమ సుందర్**

**మంచిర్యాల, మహా ప్రతినిధి**: ర్నలిస్టుల సంక్షేమం, రక్షణ కోసం జాతీయ స్థాయిలో పార్లమెంట్ లో ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) ప్రధాన కార్యదర్శి సోమ సుందర్ డిమాండ్ చేశారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నార్త్ ఇన్ హోటల్ లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమ సుందర్ ను మంచిర్యాల జిల్లా యూనియన్ నేతలు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐజేయూ ఆధ్వర్యంలో జర్నలిస్టుల హక్కుల కోసం అనేక ఉద్యమాలు చేపట్టామని తెలిపారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ప్రొటెస్ట్ కవరేజీకి వెళ్లిన జర్నలిస్టులపై పోలీసులు అమానుషంగా దాడులు చేయడాన్ని తాము ఖండిస్తున్నామని చెప్పారు. రసనకారులను ట్రీట్ చేసినట్లు జర్నలిస్టులను చూడటం సరికాదన్నారు. జర్నలిస్టులపై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని తప్పుబట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 4 లేబర్ కోడ్ లను ఉపసంహరించుకోవాలని, వాటివల్ల జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులందరికీ ఉచిత వైద్యం కోసం హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రూపిరెడ్డి ప్రకాశ్ రెడ్డి, కౌన్సిల్ సభ్యుడు కేశెట్టి వంశీకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పింగిళి సంపత్ రెడ్డి, సాక్షి స్టాఫ్ రిపోర్టర్ రాజు, ఎర్రం ప్రభాకర్, కాచం సతీష్, బిరుదుల దేవరాజ్, చొక్కారపు శ్రీనివాస్, శ్రీధర్, తిరుపతి, రాజేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ దేవి శరన్నవరాత్రులో రాజ్యలక్ష్మిగా అమ్మవారు

**రాజేంద్రనగర్ మహా** : శంషాబాద్ మండలం చ్చింతల్‌లోని స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ ప్రాంగణంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా ఆధ్యాత్మిక శోభతో కొనసాగుతున్నాయి. చిన్న జీయర్ స్వామి పర్యవేక్షణలో తొమ్మిదో రోజు అమ్మవారు శ్రీ రాజ్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేద పండితులు సర్వవిఘ్నాలు తొలగి లోక కల్యాణం కలగాలని ఆకాంక్షిస్తూ భక్తిశ్రద్ధలతో విష్వక్సేనేష్టి నిర్వహించి, అమ్మవారికి అర్చనలు, నిర్వహించారు.

# ఇనాంభూమివివాదంలోన్యాయంచేయండి

- **ఆర్డీవో ఆదేశించినా భూమి కొలతలు చేపట్టలేదని ఎమ్మార్వోపై బాధితుడి ఆరోపణ!?**
- **జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని భూమిని పరిశీలించి న్యాయం చేయాలని బొంకూరి సుభాష్ విజ్ఞప్తి**



శ్రీయుత గౌరవనీయులైన పెద్దపల్లి జిల్లా కలెక్టర్ పెద్దపల్లి గారికి,

తేది: 13-10-2026,



13 OCT 2026

**పెద్దపల్లి మహా :** తనకు చెందాల్సిన ఇనాం భూమి విషయంలో న్యాయం చేయాలని పెద్దపల్లి శివారుకు చెందిన బొంకూరి సుభాష్ అధికారులను వేడుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ భూమిని కొలిచి స్వాధీనం చేయడంలో నిర్లక్ష్యం వహించారని ఆయన ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతున్నారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి శివారులోని సర్వే నంబర్ 693లో 208 గజాల ఇనాం భూమి ఉంది. తన తండ్రి బొంకూరి పోచాలు రామస్వామి వద్ద రూ.5 వేలు, విశ్వనాథం వద్ద రూ.7 వేలు అప్పుగా తీసుకున్నారని, అప్పు తిరిగి చెల్లించే క్రమంలో ఎదురైన ఇబ్బందుల నేపథ్యంలో తమ భూమిలో ఉండేందుకు వారికి అనుమతించినట్లు సుభాష్ పేర్కొన్నారు. అయితే, ఆ అవకాశాన్ని ఆసరాగా చేసుకుని సంబంధిత వ్యక్తులు ఇంటి నంబర్ల ఆధారంగా భూమిని తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై అప్పట్లో రెవెన్యూ అధికారులతో పాటు ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు విచారణ చేపట్టి, సదరు భూమి మాదిగల ఇనాం భూమిగా గుర్తించారని, సంబంధిత రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు సుభాష్ వెల్లడించారు. ఆ ఆదేశాల మేరకు అప్పటి తహసీల్దార్ క్షేత్రస్థాయిలో పంచనామా నిర్వహించి భూమిని తనకు స్వాధీనం చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం తాను మూడు నాలుగేళ్లపాటు ఆ భూమిలో ఉన్నప్పటికీ, అవతలి వ్యక్తులు కోర్టుల్లో కేసులు వేయడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నానని సుభాష్ తెలిపారు. ఈ నేపథ్యంలో 2025 మార్చి 25న ప్రస్తుత ఆర్డీవో భూమిని కొలిచి, ఫొటోలు, వీడియోలు తీసి నివేదిక అందించాలని తహసీల్దార్‌ను ఆదేశించినట్లు చెప్పారు. అయితే, ఆ ఆదేశాల మేరకు పూర్తిస్థాయిలో భూమి కొలతలు చేపట్టలేదని ఆరోపించారు. 2025 జూన్ 25న రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలించారని, భూమిని కొలవడానికి వీలులేదని చెప్పి అనంతరం తనకు నోటీసు ఇచ్చారని సుభాష్ పేర్కొన్నారు. సకాలంలో భూమిని కొలిచి అప్పగించి ఉంటే తనకు న్యాయం జరిగేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై 2026 ఆగస్టు 13న జిల్లా కలెక్టర్‌కు మరోసారి ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని ఆయన వాపోయారు. తనకు న్యాయబద్ధంగా చెందాల్సిన ఇనాం భూమిని తిరిగి పొందేందుకు జిల్లా కలెక్టర్, రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించాలని, పాత రికార్డులు పరిశీలించి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని బొంకూరి సుభాష్ విజ్ఞప్తి చేస్తున్నారు.



## పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఆయుధ పూజ

- **పాల్గొన్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా** : దుర్గామాత నవరాత్రులలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హేమచంద్రపురంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో సోమవారం ఆయుధ వాహన పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయుధ పూజ కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలను ప్రత్యేకంగా అలంకరించి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఆయుధ పూజ మన సంప్రదాయాలకు ప్రతీక అని ప్రజల రక్షణ శాంతిభద్రతల పరిరక్షణలో ఆయుధాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఆయుధాల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ క్రమశిక్షణ అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ నేరాల నియంత్రణ అత్యవసర సమయాల్లో ప్రజలకు తక్షణ సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించే పోలీస్ వాహనాలను ఎప్పటికప్పుడు సక్రమమైన స్థితిలో ఉంచాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేలా అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ వేడుకలను పురస్కరించుకుని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు, ఆర్ఐలు, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీ మహిషాసుర మర్దనీ దేవి అలంకరణలో అమ్మవారు

- **పెద్దమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు**
- **అమ్మవారిని దర్శించుకున్న భక్తజనం**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** శ్రీ దేవి శరన్నవరాత్రుల మహోత్సవ కార్యక్రమాలలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైటర్ బస్తి ఏరియా సింగరేణి సెంట్రల్ వర్క్ షాప్ ఆవరణలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. దసరా ఉత్సవాలలో భాగంగా సోమవారం మహిషాసుర మర్దనీ దేవిఅలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. పూజలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కుంకుమార్చన కూడా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు ఎల్ వి త్యాగరాజ శర్మ, అర్చకులు ఎల్వి పవన్ శర్మలు గోత్రనామాలు చదివిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



# ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం.!

- జిల్లా రెవెన్యూ అధికారి శారదా దేవి
- సంబంధిత జిల్లా అధికారులకు ఆదేశాలు..



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా**: మీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 33 ఫిర్యాదులు అందాయని, వెంటనే పరిష్కరిస్తామని డిఆర్ఓ తెలిపారు. సోమవారం రంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు, ప్రజావాణిలో తమ సమస్యలను జిల్లా రెవెన్యూ అధికారి శారదా దేవికి, విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ శారదా దేవి మాట్లాడుతూ... ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వెన్యూ శాఖ- 22, ఇతర శాఖలు 11, మొత్తం 33 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల

- జూలూరుపాడు టెన్నల్ పనులను సంవత్సరం లోపు పూర్తి చేయాలని ఆదేశం
- వినోబానగర్ గ్రామ అభివృద్ధికి రూ. 10 లక్షల నిధుల హామీ

**జూలూరుపాడు, మహా**: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల పరిధిలో జరుగుతున్న సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ పనులను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. జూలూరుపాడు టెన్నల్ పనులతో పాటు పాలేరు లింకు కాలువ పనులను మళ్లీ దసరా నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాలువ నిర్మాణ పనులకు పరిసర ప్రాంత రైతులంతా సహకరించాలని కోరారు. ఈ కాలువ ద్వారా ప్రతి నియోజకవర్గంలో 50వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంమని తెలిపారు. ఈ సందర్భంగా వినోబానగర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ గంగావత్ నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికైనందున గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే నిధుల నుంచి రూ. 10 లక్షలు కేటాయించాలని స్థానిక ఎమ్మెల్యేకు సూచించారు. అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావం కారణంగా రైతులు రెండో పంట వేయకూడదని సూచించారు. ఒకవేళ సాగు చేస్తే, అధిక నీరు అవసరమయ్యే పంటలు కాకుండా, తక్కువ నీటితో పండే పెసలు, ఇతర పప్పు ధాన్యాలను మాత్రమే సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తోపాటు పార్టీ ముఖ్య నాయకులు, సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా నవదుర్గ అఖండ జ్యోతి పూజ..

- తొలిసారిగా నవదుర్గల అలంకరణలో ప్రత్యేక పూజలు
- పెద్ద ఎత్తున తరలివచ్చిన భవానీలు, భక్తులు..

**మణుగూరు, మహా** : మణుగూరు పట్టణంలోని ఐలమ్మనగర్‌లో స్వయంభువుగా వెలసిన శ్రీశ్రీ కనకదుర్గా సహిత పెద్దమ్మతల్లి జీవాలయంలో ఆదివారం నవదుర్గ అఖండ జ్యోతి పూజను వైభవంగా నిర్వహించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని రాపర్తి శ్రీహరినాథ్ గురుస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. మణుగూరులో తొలిసారిగా నవదుర్గల రూపాల్లో అమ్మవారిని అలంకరించి, అరటి చెట్లతో ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేసి అఖండ జ్యోతిని వెలిగించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, చండీ పారాయణం, నవదుర్గా స్తోత్ర పఠనం నిర్వహించారు. పురోహితులు శేషగిరిశర్మ (గిరి) ప్రత్యేక పూజలు నిర్వహించగా, వెంకటేశ్వర్లు గురుస్వామి ఆలపించిన అమ్మవారి భక్తిగీతాలు భక్తులను అలరించాయి. గీతా ధర్మ ప్రచార సమితి సభ్యులు లలితా సహస్రనామం, భగవద్గీత, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. సాయంత్రం భక్తుల సమక్షంలో అఖండ జ్యోతిని వెలిగించి అమ్మవారికి ప్రత్యేక హారతులు సమర్పించారు. భవానీ దీక్షామాతలు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భజనలు, భక్తిగీతాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అల్పాహారం పంపిణీ చేశారు. భక్తుల సహకారంతో నవదుర్గ అఖండ జ్యోతి పూజను ఏటా మరింత ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రాపర్తి శ్రీహరినాథ్ గురుస్వామి, శేషగిరిశర్మ, వెంకటేశ్వర్లు గురుస్వామి, గీతా ధర్మ ప్రచార సమితి సభ్యులు, భవానీ మాతలు, మహిళా భక్త మండలి సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, ఐలమ్మనగర్ వాసులు పాల్గొన్నారు.

# నీటి నిల్వ పెంపునకు తక్షణ చర్యలు చేపట్టాలి

- మూడు జిల్లాల తాగునీటి అవసరాల కోసం నీటిని పొదుపుగా వినియోగించాలి
- సీతమ్మసాగర్ ప్రాజెక్టు పనులు నవంబర్ నుంచి ప్రారంభించేలా సన్నద్ధం కావాలి
- నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ పెంపునకు తక్షణ చర్యలు చెప్పటడంతో పాటుగా మూడు జిల్లాల తాగునీటి అవసరాల కోసం నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామ పరిధిలోని దుమ్ముగూడెం ఆనకట్టను రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్ చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. రానున్న వేసవిలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆనకట్ట వద్ద నీటి నిల్వను పెంచేందుకు చేపట్టాల్సిన తక్షణ చర్యలను అధికారులతో సమీక్షించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. దుమ్ముగూడెం ఆనకట్ట పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 0.8 టీఎంసీలు కాగా ప్రస్తుతం సుమారు 0.5 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. గోదావరి నదిలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుకూలమైన పరిస్థితులు పరిమితంగా ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని వృథా కాకుండా నిల్వ చేసుకోవడం అత్యంత ముఖ్యమన్నారు. దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి మూడు జిల్లాలకు తాగునీరు అందించాల్సి ఉన్నందున రానున్న నెలల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులకు కారణమవుతున్న సూపర్ ఎల్‌నినో భూతం ప్రభావంతో రానున్న కాలంలో తీవ్రంగా ఉండే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని దక్షిణ భారత దేశంలో వర్షపాతంపై కూడా ప్రభావం పడుతుందని తెలిపారు. ఇప్పటికే ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రానున్న వేసవిలో నీటి లభ్యతపై ఆందోళన నెలకొందన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ జలవనరులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రానున్న వేసవిలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని దీంతో విద్యుత్ వినియోగం డిమాండ్ కూడా పెరిగి విద్యుత్ కొరత ఏర్పడే పరిస్థితులు తలెత్తవచ్చని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని అన్నారు. రానున్న వేసవిలో విద్యుత్ కొరత తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకుని నీరు విద్యుత్ వనరుల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద సుమారు ఒక మీటరు ఎత్తు వరకు ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి నీటిని నిల్వ చేసుకునే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి సూచించినట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులు వెంటనే పనులు ప్రారంభించాలని విజయదశమి పండుగ రోజైనా పనులకు ఆటంకం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఇసుక బస్తాల ఏర్పాటు ద్వారా సాధ్యమైనంత ఎక్కువ నీటిని నిల్వ చేసుకునేలా ఇంజినీరింగ్ అధికారులు సాంకేతిక అంశాలను పరిశీలించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. నీటి ప్రవాహం తగ్గకముందే పనులు పూర్తి చేసి నీటిని నిల్వ చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ చర్యల ద్వారా ఒక టీఎంసీ కంటే ఎక్కువ నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటే రానున్న నెలల్లో మరింత కాలం తాగునీటి అవసరాలను తీర్చవచ్చని తెలిపారు. ఆనకట్ట వద్ద నీటి నిల్వ పెంపు చర్యలతో పాటు నీటి వినియోగాన్ని కూడా నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి అధికారులకు సూచించారు. సమీపంలోని ప్రైవేటు జలవిద్యుత్ కేంద్రానికి నీటి వినియోగం విషయంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆనకట్టలో తగినంత నీటి నిల్వ ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. తాగునీటి అవసరాలకు సరిపడా నీరు నిల్వ ఉన్నప్పుడు అదనంగా ప్రవహించే మిగులు నీటిని మాత్రమే ఇతర అవసరాలకు వినియోగించేలా సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. తాగునీటి అవసరాలకు సరిపడా నీరు అందుబాటులో లేని పరిస్థితుల్లో ఇతర అవసరాలకు నీటి వినియోగాన్ని నియంత్రించాలని స్పష్టం చేశారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మాణంపై మంత్రి మాట్లాడుతూ వివిధ అనుమతులు న్యాయపరమైన అడ్డంకుల కారణంగా గత ఐదేళ్లుగా ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రాజెక్టుకు అవసరమైన అనుమతుల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోందని అన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు ద్వారా సంబంధిత న్యాయపరమైన అంశాల్లో పురోగతి సాధించామని, ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఈ నెలలో లభించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నిర్మాణానికి అవసరమైన యంత్రాలు సామగ్రి సిబ్బంది ఇతర వనరుల సమీకరణపై ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత నిర్మాణ సంస్థకు సూచించారు. నవంబర్ నుంచి ప్రాజెక్టు పనులు ప్రారంభించేలా జిల్లా యంత్రాంగం నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రాజెక్టు పనుల ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసుకోవడం ద్వారా అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపట్టేందుకు వీలవుతుందని అన్నారు. రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. పంటల సాగుకు ఎకరానికి లక్ష నుంచి రెండు మూడు లక్షల రూపాయల వరకు పెట్టుబడి అవసరమవుతున్న నేపథ్యంలో పంట చేతికొచ్చే సమయంలో నీరు విద్యుత్ భూగర్భ జలాల కొరత ఏర్పడితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల సాగుకు ముందే నీటి లభ్యత విద్యుత్ సరఫరా భూగర్భ జలాల పరిస్థితులను అంచనా వేసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. తక్కువ వ్యవధిలో దిగుబడి ఆదాయం వచ్చే కూరగాయలు పప్పుదినుసులు వంటి పంటలను అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా సాగు చేయాలని మంత్రి సూచించారు. ఒకటి లేదా రెండు తడులతో పంట చేతికి వచ్చే అవకాశాలను పరిశీలించాలని అధిక నీరు అవసరమయ్యే పంటల సాగు విషయంలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. నీటి లభ్యతపై స్పష్టత లేకుండా అధిక పెట్టుబడులతో పంటలు సాగుచేసి నష్టపోవడం కంటే అందుబాటులో ఉన్న వనరులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం మంచిదని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై సూచనలు అందించాలని ఆదేశించారు. ప్రజలు కూడా తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా కాపాడుకోవడంతో పాటు భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. జిల్లా యంత్రాంగం నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ పెంపు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, సంబంధిత శాఖల అధికారులు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వినతులకు సత్వరపరిష్కారం చూపాలి

- ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు
- పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ : వెంకటరావు



**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుంచి స్వీకరించే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఎస్.డీ.సీ పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే.వెంకట రావు సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా ఉపాధికల్పన అధికారి కే.శ్రీరామ్ తో కలిసి ప్రజల నుంచి వినతులు ఫిర్యాదులను స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలు రెవెన్యూ అంశాలు సంక్షేమ పథకాలు ఉపాధి పింఛన్లు గృహాలు మౌలిక వసతులు సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ముఖ్యమైన వేదికగా నిలుస్తోందన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం జాప్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఎలాంటి ఆలస్యం లేకుండా పరిష్కరించాలని క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమకు సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో వినతులు సమర్పించి స్థానిక స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం పొందాలని సూచించారు. వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. సంబంధిత అధికారులు ప్రజావాణిలో సమర్పించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వారి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ద్వారకాపురి కాలనీలో భూకబ్జా ఆరోపణలు

**కుషాయిగూడ, మహా:** ద్వారకాపురి కాలనీలో తమ భూమిని ఆక్రమించి, ప్రశ్నించిన తమపైనే తప్పుడు కేసులు నమోదు చేయిస్తున్నారని భూయజమానులు సింగిరెడ్డి లక్ష్మారెడ్డి, సింగిరెడ్డి రోహిత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం కుషాయిగూడలో విలేకరులతో మాట్లాడుతూ తమకు జరిగిన అన్యాయంపై సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. సర్వే నంబర్లు 29, 210, 211, 212, 230 పరిధిలోని తమ స్థలంలో ఓబయ్య అనే వ్యక్తి సరిహద్దులు దాటి ప్రహరీ గోడ నిర్మించారని వారు ఆరోపించారు. తమ స్థలంలో నిర్మాణం ఎందుకు చేపట్టారని ప్రశ్నించినందుకు బెదిరింపులకు పాల్పడటంతోపాటు, కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో తమపై తప్పుడు ఫిర్యాదులు చేసి కేసులు పెట్టిస్తున్నారని వాపోయారు. తమ ఖాళీ స్థలంలో సుమారు 80 గజాలను ఆక్రమించి ప్రహరీ నిర్మించారని పేర్కొన్నారు. మొత్తం 16 ఎకరాల స్థలాన్ని అభివృద్ధి కోసం ఇచ్చామని, సరిహద్దులు దాటి నిర్మాణాలు ఎందుకు చేపడుతున్నారని ప్రశ్నిస్తే తమనే వేధింపులకు గురిచేస్తున్నారని బాధితులు తెలిపారు. తమ స్థలం చుట్టూ సుమారు 200 కుటుంబాలు నివసిస్తున్నాయని, ఈ వ్యవహారంపై అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు. తమను విచారించకుండా, సంప్రదించకుండా, 41వ నోటీసు ఇవ్వకుండానే ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమపై నమోదైన కేసులను చట్ట ప్రకారం సమీక్షించి, అక్రమ నిర్మాణం జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ స్థలంలో నిర్మించిన ప్రహరీ గోడపై విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినట్లు నిర్ధారణ అయితే తొలగించాలని, ఆక్రమణకు గురైన స్థలాన్ని తిరిగి తమకు అప్పగించాలని సింగిరెడ్డి లక్ష్మారెడ్డి, సింగిరెడ్డి రోహిత్‌రెడ్డి సంబంధిత శాఖల అధికారులను కోరారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



# ఘోర రోడ్డు ప్రమాదం.. మహిళ మృతి..

**మరొకరికి తీవ్ర గాయాలు..**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద తుక్కుగూడ నుండి శంషాబాద్ కి వచ్చే దారిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సిమెంట్ లోడ్‌తో వస్తున్న అశోక్ లేలాండ్ మినీ ట్రక్కు ( నెం టీఎస్ 08 యుహెచ్ 3982) వాహనం టైరు అకస్మాత్తుగా పేలిపోవడంతో డ్రైవర్ వాహనాన్ని నిలిపివేశాడు. అదే సమయంలో వెనుక నుండి వేగంగా వస్తున్న హ్యుందాయ్ ఐ 10 కారు నెం. ఏపీ 37 డిహెచ్ 6036), రోడ్డుపై ఆగి ఉన్న మినీ ట్రక్కును వెనుక నుండి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. కారు నడుపుతూ వ్యక్తి యామిజాల సూర్య నారాయణ మూర్తి ( 37 ) లెక్చరర్, ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు, అయిన చికిత్స నిమిత్తం అపోలో హాస్పిటల్‌కు తరలించారు. యామిజాల నాగ సూర్య సుందరి (65) గృహిణి, ఈమె కారు నడుపుతున్న వ్యక్తి తల్లి. ప్రమాద స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. బాధితులిద్దరూ పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం ప్రాంతానికి చెందినవారుగా గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు..

- మత్తు కోసం దుర్వినియోగమయ్యే మందుల విక్రయాలపై అప్రమత్తంగా ఉండాలి..
- మణుగూరు మెడికల్ షాపుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్విని, సీఐ నాగబాబు తనిఖీలు



**మణుగూరు, మహా :** మెడికల్ షాపుల నిర్వాహకులు ఔషధ విక్రయ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్విని, మణుగూరు సీఐ నాగబాబు సూచించారు. సోమవారం మణుగూరు పట్టణంలోని పలు మెడికల్ షాపుల్లో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల లైసెన్సులు, మందుల నిల్వలు, గడువు ముగిసిన ఔషధాలు, కొనుగోలు బిల్లులు, విక్రయ రికార్డులు, ఫార్మసిస్ట్ అందుబాటు, మందుల నిల్వ విధానాలను పరిశీలించారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్‌తో మాత్రమే విక్రయించాల్సిన మందుల విషయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్విని సూచించారు. ఈ సందర్భంగా సీఐ నాగబాబు మాట్లాడుతూ యువత, విద్యార్థులు మత్తు కోసం దుర్వినియోగం చేసే అవకాశం ఉన్న కొన్ని రకాల దగ్గు మందులు, ఇంజక్షన్లు, ఇతర ఔషధాల విక్రయాల విషయంలో నిర్వాహకులు ప్రత్యేక అప్రమత్తత పాటించాలన్నారు. వైద్యుల సూచన అవసరమైన మందులను ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయించరాదని, అనుమానాస్పదంగా పెద్ద మొత్తంలో మందులు కొనుగోలు చేసే వారి విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. ఔషధాలు దుర్వినియోగం కాకుండా మెడికల్ షాపుల నిర్వాహకులు అధికారులకు సహకరించాలని కోరారు. నిబంధనలను ఉల్లంఘించి మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. తనిఖీల్లో మణుగూరు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు



## ప్రతి ఇంటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలి

- **నగర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు**
- **జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న**

**కార్పొరేషన్, మహా :** చెడు పై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి పర్వదినం అని నగర ప్రజల జీవితాల్లో ఈ పండుగ కొత్త వెలుగులు నింపాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, ఐకమత్యం మరింత బలపడాలని కోరుకుంటూ నగర ప్రజలందరికీ హృదయపూర్వక విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

# సింగరేణి అధికారులకు దసరా కానుక..

- **కోల్ ఇండియా తరహాలో వేతనాల పెంపు..**
- **18 వందల మంది అధికారులకు ప్రయోజనం.. ఉత్తర్వులు జారీ**
- **సెప్టెంబరు 25 నుంచి ఆర్థిక ప్రయోజనాలు..**
- **అక్టోబరు జీతం నుంచే అమలు**



**మణుగూరు, మహా :** సింగరేణి కాలరీస్ కంపెనీ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం దసరా కానుక అందించింది. అధికారుల చిరకాల డిమాండ్‌కు అనుగుణంగా కోల్ ఇండియా తరహాలో వేతనాలను పెంచుతూ సింగరేణి యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ మేరకు తీసుకున్న ఈ నిర్ణయంతో ఎగ్జిక్యూటివ్ క్యాడర్ ఈ-1 నుంచి ఈ-7 వరకు సుమారు 1,800 మంది అధికారులకు ప్రయోజనం చేకూరనుంది. సవరించిన బేసిక్ వేతనాలు 2017 జనవరి 1 నుంచి వర్తించనున్నప్పటికీ, ఆర్థిక ప్రయోజనాలు సింగరేణి బోర్డు ఆమోదం తెలిపిన 2026 సెప్టెంబరు 25 నుంచి అమలుకానున్నాయి. పెరిగిన వేతనాలను అక్టోబరు నెల జీతాల నుంచే చెల్లించనున్నారు. ఈ మేరకు సంస్థ డైరెక్టర్ (పర్సనల్) గౌతమ్ పోట్రు సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.

**- క్యాడర్ల వారీగా పెరిగిన బేసిక్ వేతనాలు**

కొత్త వేతనాల ప్రకారం ఈ-1 క్యాడర్ అధికారుల బేసిక్ వేతనం రూ.40 వేల నుంచి రూ.60 వేలకు, ఈ-2 క్యాడర్‌కు రూ.50 వేల నుంచి రూ.70 వేలకు, ఈ-3 క్యాడర్‌కు రూ.60 వేల నుంచి రూ.80 వేలకు పెరిగింది. ఈ-4 క్యాడర్‌కు రూ.70 వేల నుంచి రూ.90 వేలకు, ఈ-5 క్యాడర్‌కు రూ.80 వేల నుంచి రూ.లక్షకు, ఈ-6 క్యాడర్‌కు రూ.90 వేల నుంచి రూ.1.20 లక్షలకు, ఈ-7 క్యాడర్‌కు రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షలకు బేసిక్ వేతనాలు పెరిగాయి. కోల్ ఇండియాలో అమలవుతున్న వేతన విధానాన్ని సింగరేణిలోనూ అమలు చేయాలని అధికారులు కొంతకాలంగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో జూలైలో అధికారుల విజ్ఞప్తిపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దసరాలోపు వేతన సవరణపై నిర్ణయం తీసుకోవాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. దీంతో ప్రత్యేక కమిటీ నివేదిక ఆధారంగా సింగరేణి బోర్డు వేతనాల పెంపునకు ఆమోదం తెలిపింది.

**ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు..**

తమ విజ్ఞప్తిని పరిష్కరించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సింగరేణి అధికారుల సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ అభివృద్ధికి, బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు మరింత అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు. ఇటీవల దసరా సందర్భంగా సింగరేణిలోని సుమారు 39 వేల మంది కార్మికులు, ఉద్యోగులకు రూ.596 కోట్ల బోనస్ ప్రకటించడంతో పాటు కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 చొప్పున బోనస్ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా అధికారుల వేతన సవరణ ఉత్తర్వులు వెలువడటంతో సింగరేణి అధికారుల్లో హర్షం వ్యక్తమవుతోంది.



## పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ప్రజాసేవలో మమేకం

- **మేడ్చల్ జిల్లా ముద్దుబిడ్డ తోటకూర వజ్రేష్ యాదవ్**
- **పార్టీ ఆఫీసులో ఘనంగా వజ్రేష్ యాదవ్ జన్మదిన వేడుకలు.**
- **జవహర్ నగర్ మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్**

**జవహర్ నగర్, మహా :** ప్రజా సేవలో అభినవ అశోకుడు... పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేసే నాయకుడు, మన తోటకూర వజ్రేష్ యాదవ్ అని, జవహర్ నగర్ మాజీ మేయర్ శాంతి కొటేష్ గౌడ్ పేర్కొన్నారు. జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఆఫీసులో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదిన వేడుకలు మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. డివిజన్ ఆఫీసులో కేక్ కట్ చేసి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాంతి కోటేష్ గౌడ్ మాట్లాడుతూ వజ్రేష్ యాదవ్ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నామని తెలిపారు. జవహర్ నగర్ లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజలకు మరింత సేవ చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అభివృద్ధి యే ధ్యేయంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా, మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్ గుప్తా, సత్యం వంశరాజ్, మాజీ కార్పొరేటర్లు గొడుగు వేణు, మనోధర్ రెడ్డి ,కృష్ణ గౌడ్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్ రెడ్డి, గడ్డం శ్రీనివాస్, మాట్ల శ్రీనివాస్, మాట్ల వినయ్, జనరల్ సెక్రటరీ ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు, గజ్వేల్ శంకర్, నాయకం భాస్కర్, రామకృష్ణ, బొబ్బిలి మంజుల, విజయరాయి, గండి సునీత ,నంగునూరు అశోక్ గుప్తా ,కొలిపాక సాయి కిరణ్ ,చింత విజయ, రమణ, జాన్, బాలరాజ్, గడ్డం శ్రీనివాస్, అజయ్ కుమార్, జగదీష్, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి వర్క్ షాప్ లో వైభవంగా ఆయుధ పూజ

**మందమర్రి, మహా :** దసరా పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని మందమర్రి ఏరియా సెంట్రల్ వర్క్ షాప్ లో సోమవారం ఆయుధ పూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై వర్క్ షాప్ లోని పరికరాలు, యంత్రాలు, పనిముట్లకు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, పారిశ్రామిక రంగంలో పనిముట్లు, యంత్రాలే ఆయుధాలని, జీవనోపాధికి, సంస్థ పురోగతికి దోహదపడే వాటిని దైవసమానంగా భావించి పూజించడం మన సంప్రదాయమన్నారు. ప్రతి కార్మికుడు భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలన్నారు. దసరా పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం జి.ఎల్.ప్రసాద్, ఏరియా ఇంజనీర్ (ఈ అండ్ ఎం) బాలాజీ భగవతి, ఇంచార్జ్ డిప్యూటీ జీఎం వర్క్ షాప్ నరేష్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ సుదర్శన్, వర్క్ షాప్ ఇంజనీర్లు శ్రీనివాస్, సదానందం, ఫిట్ సెక్రటరీ శర్మ, అధికారులు, కార్మిక సంఘాల నాయకులు కార్మికులు పాల్గొన్నారు.



## బీజేపీ మంచిర్యాల జిల్లా నూతన కమిటీ నియామకం

**మంచిర్యాల, మహా ప్రతినిధి :** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మంచిర్యాల జిల్లా నూతన కమిటీలో మిగిలిపోయిన పదవులను భర్తీ చేస్తూ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ఆల్ సేల్స్ కన్వీనర్ గా కమలాకర్ రావు, జిల్లా ఉపాధ్యక్షులుగా బేర సత్యనారాయణ, జిల్లా కార్యదర్శిగా దేవరనేని సంజీవ రావు, జిల్లా అధికార ప్రతినిధులుగా దేగ బాపు, కస్తూరి నాగరాజు, బంగారు వేణు గోపాల్, గర్రిపల్లి వెంకట నర్సయ్య, రాకేష్ రెన్వ లను నియమించినట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ నూతన పదాధికారులకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించాలని వారు వెల్లడించారు.



## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
- **వెల్ నెస్ సెంటర్ ను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్**

**హనుమకొండ, మహా :** వెల్ నెస్ సెంటర్ లో వైద్య సేవలు, నిర్వహణ మెరుగ్గా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. సోమవారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న వెల్ నెస్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెల్ నెస్ సెంటర్ లోని డెంటల్, గైనిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఈఎన్టీ, ఫార్మసీ స్టోర్, ఫార్మసీ, ల్యాబ్, తదితర విభాగాలను కలెక్టర్ పరిశీలించి అక్కడ పేషంట్లకు అందుతున్న వైద్య సేవలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుస్మితను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆయా విభాగాలలో ఓపి చూస్తున్న వైద్యులతో కలెక్టర్ మాట్లాడారు. ఓపి సేవల నిమిత్తం వస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని డాక్టర్ సుస్మిత జిల్లా కలెక్టర్ కు వివరించారు. వైద్యులు సిబ్బంది హాజరు పట్టికను కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రాంగణంలో ఉన్న టాయిలెట్స్ ను పరిశీలించారు. ఓపి సేవల కోసం వచ్చిన పేషంట్ల వివరాలు నమోదు చేస్తున్న విధానం, ఫార్మసీలో పేషంట్లకు మందులను ఏ విధంగా అందిస్తున్నారనేది జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వైద్య సేవల నిమిత్తం అక్కడ ఉన్న పేషంట్లతో కలెక్టర్ మాట్లాడారు. మందులు తీసుకునేటప్పుడు జాప్యం జరుగుతుందని, ఎక్కువసేపు వేచి ఉండాల్సి వస్తుందని జిల్లా కలెక్టర్ కు పేషంట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వైద్య సేవల నిమిత్తం వచ్చిన పేషెంట్లకు రాసిన మందుల వివరాలను త్వరగా ఆన్లైన్ లో నమోదు చేసి ఇవ్వాలన్నారు. డేటా ఎంట్రీ చేయడం మరింత వేగవంతం కావాలన్నారు. జాప్యం లేకుండా డేటా ఎంట్రీ కోసం అదనంగా కంప్యూటర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో ఈనెల 21 నుంచి ఆర్థిక సమ్మిళిత శిబిరాలు



**వరంగల్,కలెక్టరేట్ మహా;** భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2026 అక్టోబర్ 21 నుంచి డిసెంబర్ 31 వరకు వరంగల్ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల పరిధిలో ఆర్థిక సమ్మిళిత పథకాల సంతృప్త స్థాయి శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పర్యవేక్షించ నున్నారు. ఈ శిబిరాల్లో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన , అటల్ పెన్షన్ యోజన వంటి సామాజిక భద్రతా పథకాలలో నమోదు, ప్రధానమంత్రి జన్ ధన్ యోజన కింద బ్యాంకు ఖాతాల ప్రారంభం, పనిచేయని ఖాతాల పునరుద్ధరణ, ఆధార్ అనుసంధానం, రీకేవైసీ, నామినీ వివరాల నమోదు, డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించడం వంటి సేవలు అందించనున్నారు. అలాగే సైబర్, డిజిటల్ ఆర్థిక మోసాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. జిల్లా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకొని అర్హులైన ప్రతి ఒక్కరూ సామాజిక భద్రతా పథకాలలో నమోదు చేసుకోవడంతో పాటు, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన కేవైసీ, ఆవధార్ అనుసంధానం, నామినీ వివరాల నవీకరణ తదితర సేవలను పొందాలని కోరారు. జిల్లాలోని అన్ని బ్యాంకులు, బ్యాంకింగ్ కరస్పాండెంట్లు, గ్రామ పంచాయతీ అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.



## శ్రీశైల మల్లన్నకు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాల సమర్పణ.

శ్రీశైలం, మహా: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. కుటుంబ సమేతంగా శ్రీశైలం చేరుకున్న మంత్రి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీశైలం ఆలయానికి చేరుకున్న మంత్రికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, పాలకమండలి చైర్మన్ పోతుగుంట రమేశ్ నాయుడు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను సమర్పించారు.దర్శనం అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, ప్రజలకు మంచి జరగాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీశైలంలో భక్తుల సందడి నెలకొంది.



# విజయానికి ప్రతీక విజయదశమి

- **చెడుపై మంచి గెలుపు.. ధర్మానికి పట్టం**

**క్యాతనపల్లి మహా :** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపం దసరా పండుగ విజయదశమి.. ఈ పేరు వినగానే ప్రతి ఒక్కరిలోనూ భక్తిభావం, ఆనందం వెల్లివిరుస్తాయి. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను దేశవ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఆశ్వయుజ మాస శుక్లపక్ష దశమి రోజున జరుపుకునే ఈ పర్వదినానికి హిందూ సంప్రదాయంలో విశిష్టమైన స్థానం ఉంది.

**దుర్గామాత విజయానికి ప్రతీక..**

మహిషాసురుడనే రాక్షసుడి ఆగడాలను అంతం చేసేందుకు దుర్గాదేవి తొమ్మిది రోజుల పాటు యుద్ధం చేసి పదో రోజున అతడిని సంహరించిందని పురాణాలు చెబుతున్నాయి. ఈ విజయానికి గుర్తుగా విజయదశమిని జరుపుకుంటారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో పూజించి, పదో రోజున విజయదశమి వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. చెడును అంతం చేసి ధర్మాన్ని నిలబెట్టిన శక్తికి ప్రతీకగా దుర్గామాతను భక్తులు ఆరాధిస్తారు.

**శ్రీరాముడి విజయానికి గుర్తుగా..**

రామాయణం ప్రకారం శ్రీరాముడు రావణుడిపై విజయం సాధించిన సందర్భాన్ని కూడా విజయదశమితో అనుసంధానిస్తారు. రావణుడు గొప్ప పండితుడైనా అహంకారం, అధర్మం కారణంగా పతనమయ్యాడనే సందేశం ఈ పండుగ ద్వారా తెలుస్తుంది. మనిషి ఎంతటి శక్తిమంతుడైనా చెడు ఆలోచనలు, అహంకారం, అన్యాయానికి దూరంగా ఉండాలని విజయదశమి బోధిస్తుంది.

**జమ్మి ఆకుల్లో బంగారం..**

తెలంగాణలో విజయదశమి పండుగకు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉంది. పండుగ రోజున జమ్మి చెట్టుకు పూజలు చేసి, జమ్మి ఆకులను బంగారంగా భావించి కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధుమిత్రులకు ఇచ్చిపుచ్చుకోవడం సంప్రదాయం. పెద్దలకు జమ్మి ఆకులు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకుంటారు. పరస్పరం ప్రేమాభిమానాలను పంచుకుంటూ స్నేహసంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటారు. ఈ సంప్రదాయం ఐక్యతకు, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుంది.

**ఆయుధ పూజ.. కొత్త పనులకు శ్రీకారం**

విజయదశమి రోజున వాహనాలు, పనిముట్లు, యంత్రాలు, వ్యాపార సంస్థలకు పూజలు నిర్వహించడం ఆనవాయితీ. విద్యార్థులు పుస్తకాలకు పూజలు చేస్తారు. పలువురు కొత్త వ్యాపారాలు, శుభకార్యాలు ప్రారంభించేందుకు ఈ రోజును శుభప్రదంగా భావిస్తారు. రైతులు వ్యవసాయ పనిముట్లకు పూజలు నిర్వహించి, పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటారు. శ్రమకు గౌరవం ఇవ్వడం, వృత్తి పట్ల నిబద్ధతతో ఉండడం ఈ ఆచారాల్లోని అంతరార్థం.

**సామాజిక ఐక్యతకు ప్రతీకగా పండుగ..**

పండుగలు కేవలం ఆచార వ్యవహారాలకే పరిమితం కావు. కుటుంబాలను, బంధుమిత్రులను, సమాజంలోని వివిధ వర్గాల ప్రజలను ఒకచోట చేర్చి ఐక్యతను పెంపొందిస్తాయి. విజయదశమి కూడా అలాంటి విశిష్టమైన పండుగే. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ కలిసి పండుగను జరుపుకోవడం ద్వారా సంతోషాన్ని పంచుకుంటారు. పరస్పర విభేదాలను పక్కనపెట్టి ప్రేమ, ఆప్యాయతలతో జీవించాలనే సందేశాన్ని ఈ పండుగ అందిస్తుంది.

**నేటి సమాజానికి విజయదశమి సందేశం..**

ప్రస్తుత సమాజంలో అసూయ, ద్వేషం, అవినీతి, అన్యాయం వంటి దుష్ప్రవర్తనలను విడనాడాల్సిన అవసరం ఉంది. ఇతరులకు హాని చేయకుండా, నిజాయితీగా జీవిస్తూ, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయడమే విజయదశమి అందించే అసలైన సందేశం. మనలోని చెడు ఆలోచనలను తొలగించి, మంచి లక్షణాలను పెంపొందించుకున్నప్పుడే నిజమైన విజయం సాధించినట్లవుతుంది.చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, సంతోషాలు నింపాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సమానత్వం వెల్లివిరియాలని ఆకాంక్షిద్దాం. ధర్మాన్ని ఆచరిస్తూ, మంచిని పెంచుతూ ముందుకు సాగడమే విజయదశమి పండుగకు మనం ఇచ్చే నిజమైన గౌరవం.





## ఆలయంలో రాజసూయ యాగం నిర్వహిస్తాం

- **గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల**

**కుషాయిగూడ, మహా:** శంకర్ మటం శృంగేరి శారదా పీఠం శ్రీ విజయ గణపతి ఆలయంలో త్వరలో రాజసూయ యాగం నిర్వహిస్తామని గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని సైనిక్పురి కందిగూడా శ్రీ విజయ గణపతి ఆలయంలో నిర్వహించిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో ఆయన ప్రత్యేక అతితిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ వారు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రతినిత్యం హోమాలు అభిషేకాలు పారాయణాలు లక్షల సంఖ్యలో నిర్వహిస్తూ లోక కళ్యాణం కోసం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ నిర్వాహకులు పండరీనాథ్ పేర్కొన్నారు. గవర్నర్ రాకను పురస్కరించుకొని మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఉప్పల్ జోన్ అడిషనల్ డిసిపి వెంకటరమణ ఆధ్వర్యంలో కుషాయిగూడ పోలీసులు భారీ బంధ వస్తే ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు వందలాది మంది భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, కుషాయిగూడ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, క్రైమ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు సబ్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# నల్ల చీరలో నిధి అగర్వాల్..

టాలీవుడ్ కథానాయిక నిధి అగర్వాల్ తన ప్రత్యేకమైన ఫ్యాషన్ ఎంపికలతో అభిమానులను ఆకట్టుకుంటోంది. సంప్రదాయ దుస్తులకు ఆధునిక శైలిని జోడిస్తూ సరికొత్త లుక్స్‌తో సందడి చేస్తున్న ఈ భామ, నల్లటి దుస్తుల్లోనూ తనదైన ప్రత్యేకతను చాటుకుంటోంది. అసమాన డిజైన్‌తో రూపొందించిన బ్లాక్ అవుట్‌ఫిట్, ఆకర్షణీయమైన దుస్తుల అమరిక, అందుకు తగ్గ అలంకరణతో ఆమె లుక్ ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ఆకర్షించేలా ఉంది. నల్లటి రంగుకు ఉండే ప్రత్యేకమైన హుందాతనాన్ని ఆధునిక డిజైన్‌తో మేళవించడం ఈ లుక్‌లో ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. దుస్తులకు అనుగుణంగా ఎంచుకున్న ఆభరణాలు, ఒత్తైన వేవీ హెయిర్‌స్టైల్, ముఖానికి సహజమైన మెరుపునిచ్చే మేకప్ ఆమె రూపానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. భారీ అలంకరణలకు ప్రాధాన్యం ఇవ్వకుండా, దుస్తుల డిజైన్ ప్రధానంగా కనిపించేలా స్టైలింగ్ చేసుకోవడం ఈ ఫ్యాషన్ లుక్‌లో మరో విశేషం. సంప్రదాయ చీరలైనా, ఆధునిక వెస్ట్రన్ దుస్తులైనా సందర్భానికి తగినట్టుగా తనను తాను మలుచుకోవడంలో నిధి అగర్వాల్ ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. ఆమె ఎంచుకునే దుస్తుల శైలి యువతలో ఫ్యాషన్ పట్ల ఆసక్తిని పెంచుతోంది. ముఖ్యంగా నల్లటి దుస్తులకు ఆధునిక రూపాన్ని జోడించడం ద్వారా సింపుల్ స్టైలింగ్‌తోనూ ప్రత్యేకంగా కనిపించవచ్చనే సందేశాన్ని ఈ లుక్ అందిస్తోంది. 'మున్నా మైఖేల్' చిత్రంతో హిందీ సినీ రంగంలోకి అడుగుపెట్టిన నిధి, 'సవ్యసాచి', 'ఇస్మార్ట్ శంకర్' వంటి తెలుగు చిత్రాలతో ప్రేక్షకులకు దగ్గరైంది. విభిన్న చిత్రాల్లో నటిస్తూ తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్న ఈ నటి, వెండితెరపైనే కాకుండా ఫ్యాషన్ ప్రపంచంలోనూ తనదైన ముద్ర వేస్తోంది. నటనతో పాటు స్టైలింగ్ ఎంపికలతోనూ అభిమానులను ఆకట్టుకుంటున్న నిధి అగర్వాల్ తాజా లుక్ ఫ్యాషన్ ప్రియులకు కొత్త ఆలోచనలను అందిస్తోంది.



## మహేష్ బాబు ఫ్యాన్స్ ఆగ్రహానికి కారణమైన కీర్తి సురేష్ సినిమా టీజర్!

**'పోకిరి' డైలాగ్ వాడి.. విజయ్ విజువల్స్ చూపించడంపై సోషల్ మీడియాలో చర్చ**

టాలీవుడ్‌లో సూపర్‌స్టార్ మహేష్‌బాబుకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన సినిమాల్లోని డైలాగ్‌లు ఇప్పటికీ అభిమానులను అలరిస్తూనే ఉంటాయి. అయితే తాజాగా నటి కీర్తి సురేష్ నటించిన 'సత్యవాన్ సావిత్రి' సినిమా టీజర్ విషయంలో ఓ ఆసక్తికరమైన వివాదం తెరపైకి వచ్చింది. టీజర్‌లో మహేష్‌బాబు నటించిన 'పోకిరి' సినిమాలోని ప్రసిద్ధ డైలాగ్‌ను ఉపయోగించడంపై ఆయన అభిమానులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'సత్యవాన్ సావిత్రి' చిత్రానికి ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో ప్రముఖ దర్శకుడు, నటుడు మిస్కిన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. కోర్టు నేపథ్యంలో సాగే కథతో రూపొందిన ఈ చిత్రం టీజర్ ఇటీవల విడుదలైంది. ఇందులో వినిపించిన 'ఎప్పుడు వచ్చామన్నది కాదన్నయ్యా.. బుల్లెట్ దిగిందా లేదా!' అనే 'పోకిరి' డైలాగ్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.సాధారణంగా తమ అభిమాన హీరోకు సంబంధించిన డైలాగ్‌లు ఇతర సినిమాల్లో వినిపిస్తే అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తుంటారు. కానీ ఈ టీజర్‌లో మహేష్‌బాబు డైలాగ్ వినిపించినప్పటికీ, దృశ్యాల్లో తమిళ స్టార్ విజయ్‌కు సంబంధించిన సన్నివేశాన్ని చూపించారనే అంశంపై కొందరు మహేష్ అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. డైలాగ్ మహేష్‌బాబుది అయినప్పుడు, దానికి అనుగుణంగా ఆయనకు సంబంధించిన దృశ్యాన్ని చూపించాల్సిందని సోషల్ మీడియాలో వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు, సినిమా పేరుతో పాటు టీజర్‌లోని కొన్ని అంశాలు తమిళ చిత్రాల శైలిని గుర్తు చేస్తున్నాయనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ అంశంపై అభిమానుల స్పందనను బట్టి మాత్రమే సినిమా మొత్తం గురించి ఒక నిర్ణయానికి రావడం తొందరపాటే అవుతుంది. టీజర్ ద్వారా కథలోని ప్రధాన పాత్రలు, వాటి మధ్య సంఘర్షణను పరిచయం చేయడమే చిత్రబృందం ఉద్దేశమై ఉండవచ్చు. ఇక సినిమాలో కీర్తి సురేష్ న్యాయవాది సావిత్రి పాత్రలో కనిపించనున్నారు. తన సీనియర్ న్యాయవాది మార్కండేయన్‌తో ఆమెకు ఎదురయ్యే విభేదాలు, కోర్టులో జరిగే వాదోపవాదాలు కథలో కీలకంగా ఉండనున్నాయి. గంభీరమైన కోర్టు సన్నివేశాలతో పాటు హాస్యానికి కూడా ప్రాధాన్యం ఇచ్చినట్లు టీజర్ సూచిస్తోంది. ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్, డ్రమ్‌స్టిక్స్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తుండగా, అరుల్ విన్సెంట్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. తొలుత జూలైలో విడుదల కావాల్సిన ఈ చిత్రం వాయిదా పడగా, ప్రస్తుతం నవంబర్ 20, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. టీజర్‌తోనే సోషల్ మీడియాలో చర్చకు దారితీసిన 'సత్యవాన్ సావిత్రి' సినిమా, విడుదల తర్వాత ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి. అభిమానుల విమర్శలు, సినిమా కథపై ఆసక్తి.. ఈ రెండింటి మధ్య చిత్రబృందం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.



## చిరంజీవికి కథ చెప్పిన కార్తీక్ సుబ్బరాజ్!

మెగాస్టార్ చిరంజీవి, కోలీవుడ్ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ కలయికలో సినిమా రాబోతుందా? ప్రస్తుతం ఈ వార్త సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. చిరంజీవికి తాను కథ వినిపించినట్లు కార్తీక్ సుబ్బరాజ్ వెల్లడించడంతో మెగా అభిమానుల్లో అంచనాలు మొదలయ్యాయి. అయితే, ఈ ప్రాజెక్టు ఇంకా ఖరారు కాలేదని సమాచారం. 'పిజ్జా', 'జిగర్తాండ', 'పేట' వంటి చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు సంపాదించిన కార్తీక్ సుబ్బరాజ్ విభిన్న కథలను తెరకెక్కించడంలో పేరుగాంచారు. ఆయన చిరంజీవి కోసం ఎలాంటి కథను సిద్ధం చేశారనే అంశంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ ఇద్దరి కలయికలో సినిమా తెరకెక్కితే మెగాస్టార్‌ను కొత్త తరహాలో చూడొచ్చని సినీ ప్రియులు భావిస్తున్నారు. చిరంజీవి అంగీకారం తెలిపిన తర్వాతే ఈ ప్రాజెక్టుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం కథా చర్చల దశలోనే ఉన్న ఈ కాంబినేషన్ కార్యరూపం దాల్చుతుందా? మెగాస్టార్ గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? అన్నది అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.





## మిక్స్‌డ్ టాక్ వచ్చినా తగ్గని 'రణబాలి' జోరు!

**విజయ్ దేవరకొండ, రష్మిక క్రేజ్‌తో బాక్సాఫీస్ వద్ద సందడి**

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన 'రణబాలి' సినిమా బాక్సాఫీస్ వద్ద ఆసక్తికరమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. సినిమాకు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, ప్రధాన నటీనటుల క్రేజ్ కారణంగా ప్రేక్షకుల్లో ఆసక్తి కొనసాగుతోంది. ముఖ్యంగా విజయ్, రష్మిక జంటను తెరపై చూడాలనే అభిమానుల ఉత్సాహం సినిమాకు తోడవుతున్నట్లు తెలుస్తోంది. సినిమాకు సంబంధించిన ప్రచారం, నటీనటులపై ఉన్న అభిమానుల ఆదరణ థియేటర్లలో సందడి పెంచుతున్నాయి. సాధారణంగా విడుదలైన సినిమాలకు ప్రేక్షకుల నుంచి వచ్చే టాక్ వసూళ్లపై ప్రభావం చూపుతుంది. అయితే 'రణబాలి' విషయంలో నటీనటుల పాపులారిటీ కూడా కీలకంగా మారినట్లు కనిపిస్తోంది. కథ, కథనం విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నా, అభిమానులు మాత్రం సినిమాపై ఆసక్తి చూపుతున్నారు. విజయ్ దేవరకొండకు యువతలో ఉన్న క్రేజ్, రష్మిక మందన్నకు ఉన్న విస్తృతమైన అభిమానగణం ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలుస్తున్నాయి. రానున్న రోజుల్లో సినిమా వసూళ్లు ఎలా కొనసాగుతాయనేది ఆసక్తికరంగా మారింది. ప్రేక్షకుల స్పందన, థియేటర్ల ఆక్యుపెన్సీ ఆధారంగా 'రణబాలి' బాక్సాఫీస్ ప్రయాణంపై స్పష్టత రానుంది.




## తెలుగు రాష్ట్రాల్లో 'రామాయణ' విడుదల బాధ్యతలు దిల్ రాజుకే!

భారతీయ సినీ పరిశ్రమలో భారీ అంచనాలు రేకెత్తిస్తున్న 'రామాయణ' చిత్రానికి సంబంధించి మరో ఆసక్తికరమైన వార్త తెరపైకి వచ్చింది. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేసే బాధ్యతలను ప్రముఖ నిర్మాత దిల్ రాజు చేపట్టనున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎస్వీసీ (శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్) సంస్థ ద్వారా ఈ సినిమా తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలపై ఆసక్తి నెలకొంది. రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్న ఈ చిత్రానికి నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. భారతీయ ఇతిహాసం రామాయణం ఆధారంగా రూపొందుతున్న ఈ భారీ ప్రాజెక్టును అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కిస్తున్నారు. అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, భారీ నిర్మాణ వ్యయం ఈ సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో దిల్ రాజుకు ఉన్న పంపిణీ అనుభవం, ప్రేక్షకులతో ఆయనకు ఉన్న అనుబంధం ఈ చిత్ర విడుదలకు కీలకంగా మారనున్నాయి. అయితే, విడుదల హక్కులపై అధికారిక ప్రకటన వచ్చే వరకు పూర్తి వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది. 'రామాయణ' తెలుగు ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com